



సమావేశంలో మాట్లాడుతున్న అద్వైత్‌కుమార్‌సింగ్

సర్వేలో క్షేత్రస్థాయిలో పక్కా సమాచారం సేకరించాలి

- కలెక్టర్ అద్వైత్‌కుమార్‌సింగ్

మహబూబాబాద్, డిసెంబరు 24 (ఆంధ్రజ్యోతి) : ఇందిరమ్మ ఇళ్ల సర్వేలో క్షేత్రస్థాయిలో పక్కా సమాచారం సేకరించాలని కలెక్టర్ అద్వైత్‌కుమార్‌సింగ్ సూచించారు. కలెక్టర్ కార్యాలయంలో మంగళవారం ఇందిరమ్మ ఇళ్ల సర్వేపై సంబంధిత అధికారులతో సమీక్షా సమావేశాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఇందిరమ్మ ఇళ్ల సర్వేలో భాగంగా ఇందిరమ్మ ఇళ్ల కోసం దరఖాస్తు చేసుకున్న వారి ఇంటింటికి వెళ్లి మొబైల్‌యాప్ ద్వారా నమోదు చేస్తున్న వివరాలు, సంబంధిత డాక్యుమెంట్లను సేకరించి యాప్ ద్వారా అడుగుతున్న అన్ని కాలమ్స్ కరెక్టుగా నమోదు చేయాలని ఆదేశించారు. ఇందిరమ్మ ఇళ్ల సర్వేను ప్రభుత్వం సూచించిన గడువులోగా పూర్తి చేయాలని, సర్వే చేసే సర్వేయర్లు ఎలాంటి పొరపాట్లు జరగకుండా సర్వే చేయాలని, సర్వే చేసే సమయంలో ఇందిరమ్మ కమిటీ సభ్యుల సహాయ సహకారాలు తీసుకోవాలన్నారు. ఇందిరమ్మ కమిటీ సభ్యులు తప్పకుండా సర్వేలో పాల్గొనాలని సూచించారు. మునిసిపాలిటీల్లో కూడా సర్వే పూర్తి చేయాలని ఆదేశించారు. సర్వే అనంతరం ఎంపీడీవోలు, మునిసిపల్ కమిషనర్లు పరిశీలన చేసి సరిగా ఉందా! లేదా? చూసిన తర్వాత ప్రభుత్వానికి నివేదికలు పంపాలన్నారు. ప్రభుత్వ ఆదేశాల మేరకు అర్హులు ఎంతమంది ఉన్నారో పూర్తి వివరాలు సేకరించాలన్నారు. ఇప్పటి వరకు ఎన్ని నమోదు చేశారని అడిగి తెలుసుకుని నిర్దేశిత గడువులోగా పూర్తి చేయాలని, తొందరపాటుగా కాకుండా జాగ్రత్తగా నమోదు చేయాలన్నారు. మొబైల్‌యాప్‌లో నమోదు చేసే సమయంలో సమస్యలుంటే అధికారుల దృష్టికి తీసుకురావాలని చెప్పారు. ఈ సమావేశంలో అదనపు కలెక్టర్ కె.వీరబ్రహ్మాచారి, అధికారులు పురుషోత్తం, రాజయ్య, నేముల రవీందర్, వెంకటస్వామి, నరేష్‌రెడ్డి, నారాయణరెడ్డి, ప్రశాంత్, సురేష్ పాల్గొన్నారు.




హ్యాపీ క్రిస్మస్

నేటి వేడుకలకు ముస్తాబైన ప్రార్థనా మందిరాలు

- జిల్లాలో విద్యుత్ దీపాలతో చర్చిల అలంకరణ
- స్టార్లతో కళకళలాడుతున్న గృహాలు
- ఏసును కీర్తిస్తూ గీతాలు ఆలపించనున్న క్రైస్తవ సోదరులు

మహబూబాబాద్ ఎడ్యుకేషన్, డిసెంబరు 24 (ఆంధ్రజ్యోతి) : జిల్లాలో క్రిస్మస్ వేడుకలకు క్రైస్తవులు సిద్ధమయ్యారు. మహబూబాబాద్ జిల్లా వ్యాప్తంగా 18 మండలాల పరిధిలో సుమారు 650 ప్రార్థనా మందిరాలుండగా, బుధవారం జరిగే వేడుకలకు అలంకరించారు. చర్చిలను స్టార్‌లతో ముస్తాబు చేశారు. రంగురంగుల విద్యుత్ కాంతులతో మిరుమిట్లు గొల్పుతున్నాయి. గత వారం రోజులు నుంచి క్రైస్తవులు ప్రార్థనా (చర్చిలు) మందిరాలు, తమ గృహాలను వివిధ రంగులతో అలంకరించుకుని క్రిస్మస్ స్టార్లను ఏర్పాటు చేసుకొని, సంబరాలకు సన్నద్ధమయ్యారు. ఇప్పటికే పాస్టర్లు చర్చిలలో ప్రత్యేక ప్రార్థనలు చేస్తూ, సెమిక్రిస్మస్ వేడుకలను నిర్వహించుకున్నారు. క్రిస్మస్ పర్వదినాన ప్రార్థనా మందిరాల్లో నేడు తెల్లవారుజామున కేకులు కట్‌చేసి, వీధుల్లో తిరుగుతూ ప్రజలకు క్రిస్మస్ శుభాకాంక్షలు తెలిపి, ప్రత్యేక ప్రార్థనలు

మిగతా 8వ పేజీలో...


విద్యుత్ దీపాలతో అలంకరించిన మహబూబాబాద్ సీఎస్ఐ చర్చి


మానుకోటలో ముస్తాబైన ఎడ్వర్డ్ చర్చ్

కొత్తగూడలో భారీ వర్షం

- ధాన్యం నిల్వలపై డీఆర్‌డీవో ఆరా


తిమ్మాపురంలో ధాన్యంపై కవర్లు కప్పుతున్న రైతు

కొత్తగూడ, డిసెంబరు 24 (ఆంధ్రజ్యోతి) : మండలంలో మంగళవారం రాత్రి భారీ వర్షం కురిసింది. కొనుగోలు కేంద్రాలలో ఉన్న ధాన్యం తడవకుండా ఉండేందుకు రైతులు జాగ్రత్తలు తీసుకున్నారు. వడ్ల నిల్వలపై టార్పాలిన్ కవర్లు కప్పుకున్నారు. కొత్తగూడ మండలంలో ఐకేపీ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న కొనుగోలు కేంద్రాలలో ధాన్యం నిల్వలపై డీఆర్‌డీఏ పీడీ మధుసుదన్‌రాజ్ ఆరా తీశారు. కొత్తగూడ ఐకేపీ ఏపీఎం గుళ్లపెల్లి శ్రీనివాస్‌కు ఫోన్‌చేసి వివరాలు తెలుసుకున్నారు. కొనుగోలు కేంద్రాలలో ధాన్యం నిల్వలపై రైతులు టార్పాలిన్ కవర్లు కప్పుకునేలా చర్యలు తీసుకోవాలన్నారు. నిర్వాహకులు కేంద్రాల వద్ద ఉండి రైతులకు సూచనలు ఇవ్వాలని ఆదేశించారు. ఏపీఎం శ్రీనివాస్ కొనుగోలు కేంద్రాల నిర్వాహకులకు ఫోన్‌చేసి సూచనలు చేశారు.

యాసంగికి ఎస్సారెస్పీ నీరు విడుదల

- జనవరి 1 నుంచి డీబీఎం-60 మెయిన్ కెనాల్‌కు
- 9 నుంచి డీబీఎం-48 కెనాల్‌కు..

మహబూబాబాద్ అగ్రికల్చర్, డిసెంబరు24 (ఆంధ్రజ్యోతి) : యాసంగి సాగుకు ఎస్సారెస్పీ నీటిని విడుదల చేస్తున్నట్లు ప్రభుత్వం నుంచి ఎస్సారెస్పీ అధికారులకు ఇటీవల ఉత్తర్వులు జారీ అయ్యాయి. జనవరి 1నుంచి మార్చి 31 వరకు డీబీఎం-60 మెయిన్ కెనాల్ ద్వారా, ఉప కాలువల ద్వార నీటిని విడుదల చేస్తారు. 8 రోజుల పాటు కాలువల నుంచి నీటిని వదిలి మరో ఏడు రోజులు నీటి విడుదలను బంద్ చేస్తారు. ఆన్‌అండ్‌ఆఫ్ పద్ధతిన ఈ ఎస్సారెస్పీ నీరువిడుదల కానుంది. డీబీఎం -60 ద్వారా తొర్రూరు, పెద్దవంగర, దంతాలపల్లి, నర్సింహులపేట, చిన్నగూడూరు, మరిపెడ మీదుగా ఖమ్మం జిల్లాకు చేరుకుంటాయి. అలాగే స్టేజీ -1 ఎస్సారెస్పీ డీబీఎం -48 మెయిన్ కెనాల్, ఉపకాలువల ద్వారా జనవరి 9 నుంచి మార్చి 31 వరకు నీటిని విడుదల చేస్తారు. మహబూబాబాద్ జిల్లాలోని ఇనుగుర్తి, కేసముద్రం, నెల్లికుదురు, మహబూబాబాద్, కురవి, సీరోలు, డోర్నకల్ మండలాల నుంచి ఖమ్మం జిల్లాకు చేరుకుంటాయి. కాగా, ఈ ఎస్సారెస్పీ నీరు విడుదల చేస్తుండడంతో యాసంగి పంటలకు మేలు జరుగనుంది. ప్రజాప్రతినిధులు, రైతుల విజ్ఞప్తి మేరకు ఈ ఎస్సారెస్పీ నీటిని విడుదల చేస్తున్నట్లు సమాచారం.

ఫోన్‌కాల్‌తో రూ.4.13 లక్షలు పోగొట్టుకున్న యువకుడు

- వివరాలు వెల్లడించిన టౌన్ సీఐ దేవేందర్

మహబూబాబాద్ రూరల్, డిసెంబరు 24 (ఆంధ్రజ్యోతి) : ఓ పరిచిత వ్యక్తివద్ద నుంచి వచ్చిన ఫోన్‌కాల్ ద్వారా మానుకోట పట్టణానికి చెందిన ఓ యువకుడు రూ.4.13 లక్షలు పోగొట్టుకున్న ఘటన మంగళవారం చోటు చేసుకుంది. టౌన్ సీఐ దేవేందర్ తెలిపిన వివరాల ప్రకారం. మహబూబాబాద్ జిల్లా కేంద్రానికి చెందిన ఓ యువకుడు ఈనెల 15న మధ్యాహ్నం 12 గంటల ప్రాంతంలో ఓ అపరిచిత వ్యక్తి వద్ద నుంచి ఫోన్‌కాల్ వచ్చింది. గోల్డ్ బిల్డింగ్ కంపెనీలో సుమారు 68మంది సభ్యులు ఉన్నారని, మీరు మాకు గైడ్‌గా వ్యవహరించాలని నమ్మబలికాడు. రూ.8 వేలు పెట్టుబడి పెడితే రూ.10 వేలు వస్తాయని ఆశా చూపించాడు. ఇది నమ్మిన యువకుడు రూ.8 వేలు పెట్టుబడిగా తన అకౌంట్ నుంచి తీసుకునేలా ఓటీపీ నెంబర్ చెప్పాడు. దీంతో అపరిచిత వ్యక్తి రూ.8 వేలు తీసుకుని యువకుడు అకౌంట్‌కు రూ.10 వేలు వేశాడు. మరోమారు ఫోన్‌చేసి మీరు 15 వేలువేస్తే రూ.30 వేలు వస్తాయని చెప్పాడు. రూ.50లక్షలు జమ చేస్తే రూ.కోటి వరకు వస్తుందని నమ్మించాడు. ఇలా పలు దఫాలుగా ఫోన్‌చేసి రూ.20 వేలు, రూ.50 వేలు ఇలా రూ.4,13,896 వరకు తన అకౌంట్ వేసుకున్నాడు. దీంతో అపరిచిత వ్యక్తి సదరు యువకుడి సెల్‌కు ఫోన్ చేసి ఓటీపీ వస్తుందని, అది చెప్పాలని తెలపడంతో తన ఫోన్‌కు వచ్చిన ఓటీపీని చెప్పాడు. అలా చెప్పడంతో తన అకౌంట్‌లో రూ.4,13,896లను మాయం చేసినట్లు చెప్పారు. ఆ తర్వాత తాను మోసపోయినట్లు తెలుసుకుని మహబూబాబాద్ టౌన్ పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేశాడు. యువకుడు ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు సీఐ తెలిపారు.

వచ్చే వేసవిలో విద్యుత్ సరఫరాకు ముందస్తు ప్రణాళికలు

● జిల్లా విద్యుత్‌శాఖ అధికారి నరేష్

మహబూబాబాద్ రూరల్, డిసెంబరు 24 (ఆంధ్రజ్యోతి) : రాబోయే వేసవి కాలంలో విద్యుత్ సరఫరాలో ఎలాంటి అంతరాయం ఏర్పడకుండ ముందస్తుగా ప్రణాళికలు సిద్ధం చేసినట్లు జిల్లా అధికారి జె.సురేష్ మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. వేసవికాలాన్ని దృష్టిలో పెట్టుకుని పెరగబోయే విద్యుత్ డిమాండ్ అంచనా మేరకు ప్రణాళికాబద్ధంగా, సమయానుగుణంగా తగిన జాగ్రత్తలు తీసుకోవడం జరుగుతుందన్నారు. కొత్తగా మూడుపవర్ ట్రాన్స్‌ఫార్మర్‌ల ఏర్పాటుతో పాటు 33/11 సబ్‌స్టేషన్‌లో రెండు పవర్ ట్రాన్స్‌ఫార్మర్‌ల సామార్థ్యంపెంచడానికి చర్యలు చేపడుతున్నట్లు చెప్పారు. గడిచిన సంవత్సర కాలంగా గరిష్ట డిమాండ్ ఉన్న సమయంలో డిస్ట్రిబ్యూషన్, ట్రాన్స్‌ఫారంలపై లోడ్ పైభారం ఎంత ఉంటుందో టాంగ్ టెస్టర్ రీడింగ్ తీసుకుని అందుకు అనుగుణంగా కొత్తగా 77 ట్రాన్స్‌ఫార్మర్‌లు అమర్చడం జరిగిందన్నారు. మెరుగైన, నాణ్యమైన విద్యుత్ సరఫరా అంతరాయం లేకుండ అందించడానికి 33 కేవీ ఇంటర్ లింకింగ్ లైన్స్ వ్యవస్థను పటిష్ట పరుస్తూ ప్రతీ ఒక్క 33/11 కేవీ సబ్‌స్టేషన్‌కు అత్యవసర పరిస్థితుల్లో ప్రత్యామ్నాయ ఫీడర్ ద్వారా విద్యుత్ సరఫరా పునరుద్ధరించడానికి అవసరమైన పనులు పూర్తి చేస్తున్నట్లు చెప్పారు. ఓవర్ లోడ్ ఉన్న 33 కేవీ, 11 కేవీ ఫీడర్‌లను గుర్తించడం జరిగిందన్నారు. మునిసిపాలిటీలలో విద్యుత్ అంతరాయలు సంభవించినప్పుడు అంతరాయాలు లేకుండా విద్యుత్ సరఫరా అందించడానికి రింగ్‌మెయిన్స్ వ్యవస్థను పటిష్ట పరుస్తూ 11 కేవీ ఫీడర్ల ద్వారా విద్యుత్ వినియోగదారులకు అంతరాయలు లేకుండా విద్యుత్ వ్యవస్థ ఏర్పాటుకు కృషి చేస్తున్నట్లు చెప్పారు. జిల్లా వ్యాప్తంగా 647 ట్రాన్స్‌ఫార్మర్‌లను ఏర్పాటు చేసినట్లు చెప్పారు. అత్యవసర సర్వీసుల్లో భాగమైన ఆస్పత్రి, మెడికల్ కళాశాలలు, పోలీస్‌స్టేషన్‌లు, అత్యవసర పరిస్థితుల్లోప్రత్యామ్నాయ విద్యుత్ సరఫరాను అందించడానికి చర్యలు తీసుకుంటున్నట్లు చెప్పారు.

వ్యవసాయ మార్కెట్‌కు రెండు రోజుల సెలవు

జనగామ కల్చరల్, డిసెంబరు 24(ఆంధ్రజ్యోతి): క్రిస్మస్ పర్వదినం సందర్భంగా జనగామ వ్యవసాయ మార్కెట్‌కు రెండు రోజులు సెలవు ప్రకటించినట్లు వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్మన్ బనుక శివరాజ్ యాదవ్ మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. 25న క్రిస్మస్, 26న బాక్సింగ్‌డే ఉన్న నేపథ్యంలో మార్కెట్ బంద్ ఉంటుందని, విషయాన్ని గమనించి రైతులు పంట ఉత్పత్తులను తీసుకురావద్దని కోరారు.

'సీఎం ఇచ్చిన హామీని అమలు చేయాలి'

మహబూబాబాద్ ఎడ్యుకేషన్, డిసెంబరు 24 (ఆంధ్రజ్యోతి) : రాష్ట్రంలో కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి రాగానే రాష్ట్ర విద్యాశాఖలో కాంట్రాక్ట్ పద్ధతిలో విధులు నిర్వహిస్తున్న సమగ్రశిక్ష అభియాన్ (ఎస్ఎస్ఏ) ఉద్యోగుల సమస్యలను పరిష్కరిస్తామని సీఎం రేవంత్‌రెడ్డి ఇచ్చిన హామీని అమలు చేయాలనే డిమాండ్‌తో జిల్లా అదనపు కలెక్టర్ వీరబ్రహ్మాచారికి వినతి పత్రం అందజేశారు. మహబూబాబాద్ జిల్లా కేంద్రంలోని తహసీల్దార్ కార్యాలయం ఎదుట ఎస్ఎస్ఏ ఉద్యోగులు చేస్తున్న సమ్మె మంగళవారం నాటికి 19వ రోజుకు చేరుకుంది. ప్రభుత్వ ఉద్యోగుల వలె సమయపాలన పాటిస్తూ విధులు నిర్వహిస్తున్న ఉద్యోగుల న్యాయమైన డిమాండ్లను పరిష్కరించాలని టీపీటీఎఫ్ జిల్లా కమిటీ, జిల్లా డీలర్స్ అసోయేషన్ బాధ్యులు, సీపీఎస్ ఉద్యోగుల సంఘం, ఆదివాసీ టీచర్స్ ఫెడరేషన్, బీఎస్పీ నాయకులు సంఘీభావం ప్రకటించారు. సమ్మె శిబిరంలో క్రిస్మస్ పర్వదినాన్ని పురస్కరించుకొని కేక్ కట్ చేశారు. సంఘీభావం ప్రకటించిన వారిలో మైస శ్రీనివాస్, రమేష్, శ్రీశైలం, ఉపేందర్, శ్రీనివాస్, బిక్షం, నాగముని, రవి, యాదగిరి, దార్ల శివరాజ్ ఉన్నారు. ఈ సమ్మెలో ఎస్ఎస్ఏ ఉద్యోగులు వీరన్న, భాస్కర్, ఉదయ్, బాబులాల్, రవీందర్, వీరస్వామి, గణేష్, సాగర్, నవీన్, మంజుల, కల్పన, సరస్వతి, నీలిమా, శైలజ, ఉషారాణి, సుమలత, స్రవంతి, సునిత పాల్గొన్నారు.

జాతీయ స్థాయి బాల్ బ్యాడ్మింటన్ పోటీలకు ఎంపిక


పొన్న వైష్ణవి

స్టేషన్‌ఘన్‌పూర్, డిసెంబరు 24 (ఆంధ్రజ్యోతి): స్టేషన్‌ఘన్‌పూర్ మండల కేంద్రానికి చెందిన పొన్న వైష్ణవి జాతీయస్థాయి సీనియర్ బాల్ బ్యాడ్మింటన్ పోటీలకు ఎంపికైనట్లు బాల్ బ్యాడ్మింటన్ అసోసియేషన్ రాష్ట్ర జనరల్ సెక్రటరీ వీవీ రమణ మంగళవారం ఘన్‌పూర్‌లో తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఇటీవల హన్మకొండ జేఎన్ఎస్ ఇండోర్ స్టేడియంలో జరిగిన రాష్ట్రస్థాయి పోటీల్లో వైష్ణవి ప్రతిభ కనబరిచి జాతీయ స్థాయి పోటీలకు ఎంపికైందన్నారు. ఈనెల 26 నుంచి 29 వరకు ముంబాయిలో జరిగే జాతీయ స్థాయి పోటీల్లో పాల్గొననుందన్నారు. ప్రస్తుతం వైష్ణవి ఖాజీపేటలోని మెలుహా హైస్కూల్‌లో పదవ తరగతి చదువుతుందని తెలిపారు.

యథేచ్ఛగా నకిలీ సర్టిఫికెట్ల దందా

● భూపాలపల్లి జిల్లా కేంద్రంగా డూప్లికేట్ మెమోల జారీ! ● లక్షలాది రూపాయలు చేతులు మారుతున్నట్టు ఆరోపణలు ● ఆర్‌జేడీకి ఫిర్యాదు చేసినా పట్టించుకోని వైనం

భూపాలపల్లిటౌన్, డిసెంబరు 24 (ఆంధ్రజ్యోతి): భూపాలపల్లి జిల్లా కేంద్రంగా పదో తర గతి డూప్లికేట్ మెమోల దందా కొనసాగుతోందనే ఆరోపణలు వినిపిస్తున్నాయి. విద్యాశాఖలో పనిచేస్తు న్న కొందరు లక్షలు తీసుకొని ఈ అక్రమ వ్యాపారానికి తెరతీశారని తెలుస్తోంది. ఈ నేపథ్యంలో ఓ ఉపా ధ్యాయ సంఘం నాయకుడు ఆర్‌జేడీకి ఫిర్యాదు చేసి నా పట్టించుకోకపోవడంపై మరిన్ని అనుమానాలకు తావిస్తోంది.

రికార్డుల్లో లేకుండానే మెమోలు

పదో తరగతి మెమో పోగొట్టుకున్న వారు డూప్లికేట్ పొందాలంటే ముందుగా పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేయాలి. అనంతరం ఎఫ్ఐఆర్ కాపీని సంబంధిత పాఠశాలలో అప్పగించాలి. అప్పుడు ఆ పాఠశాల ప్రధానోపాధ్యాయుడు రికార్డులను పరిశీలిస్తారు. రికార్డుల్లో పొందుపరిచిన వివరాలతో మెమో జారీ చేయడానికి ఎస్సెస్సీ బోర్డుకు సిఫార్సు చేయాల్సి ఉంటుంది. అక్కడి నుంచి డూప్లికేట్ మెమో వచ్చాక ఆ విద్యార్థిని పిలిచి పాఠశాల ప్రధానోపాధ్యాయుడు సంతకం చేసి, ఔట్‌వర్డ్ రిజిష్టర్‌లో నమోదు చేసి స్టాంప్ వేసి ఇవ్వాలి. కానీ అలా ఏమీ జరగకుండానే జిల్లాలో డూప్లికేట్ మెమోలు జారీ అవుతున్నట్టు సమాచారం. పోగొట్టుకున్న మోమోల జారీ పేరుతో రికార్డుల్లో లేని వాటిని కూడా డూప్లికేట్ ఫార్మాట్‌లో జారీ చేయడం కలకలం రేపుతోంది.

కేటీపీపీలో ఉద్యోగాల కోసం ..

భూపాలపల్లి ఏరియాలో జెన్‌కో సంస్థ ఆధ్వర్యంలో కాకతీయ థర్మల్ పవర్ ప్రాజెక్టు (కేటీపీపీ) ఏర్పాటైంది. ఇందులో భూములు కోల్పోయిన నిర్వాసితులకు, ఈ ప్రాంత నిరుద్యోగ యువతకు ఉద్యోగావకాశం కల్పిస్తామని అప్పటి ప్రభుత్వం హామీ ఇచ్చింది. ఈ క్రమంలో పలువురు తాము పదో తరగతి చదవకపోయినా ఎలాగైనా సర్టిఫికెట్లు పొందాలనే దురుద్దేశంతో విద్యాశాఖలోని కొందరు అధికారుల ద్వారా సర్టిఫికెట్లు పొందుతున్నారని ఆరోపణలు వస్తున్నాయి. గతంలో ఇలాంటి ఉదంతాలు చోటుకోగా ఇప్పటికీ ఈ దందా కొనసాగుతోందని తెలుస్తోంది.

ఇద్దరి పేర్లూ ఒక్కటే కావడంతో...

కాటారం మండల కేంద్రంలో ఉన్న ప్రభుత్వ జిల్లా పరిషత్ బాలుర ఉన్నత పాఠశాల నుంచి జి.రమేష్ అనే విద్యార్థి 1992-97 మధ్యలో ఆరు నుంచి పదో తరగతి వరకు చదివాడు. 1997లో పదో తరగతి సర్టిఫికెట్లు కూడా పొందాడు. ఇదే పాఠశాలలో జి.రమేష్ అనే మరో విద్యార్థి 1990-93 వరకు ఎనిమిదో తరగతి చదివి డిస్కంటిన్యూ చేశాడు. అయితే. కొంతకాలానికి జెన్‌కో సంస్థ ఆవిర్భావించడం, అందులో రెండో రమేష్‌కు ఉద్యోగం రావడంతో పదో తరగతి సర్టిఫికెట్ అవసరం వచ్చింది. ఈ క్రమంలో ఆ రమేష్ ఇక్కడి నుంచే పదో తరగతి పూర్తి చేసినట్లు డూప్లికేట్ మెమో తీసుకున్నాడు. పదో తరగి పూర్తి చేసిన విద్యార్థి పేరునే కలిగిన మరో విద్యార్థి ధ్రువీకరణ పత్రం పొందడం విస్మయానికి గురిచేస్తోంది. ఈ విషయంపై టీటీయూ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఏరుకొండ నరసింహస్వామి ఆర్‌జేడీకి ఫిర్యాదు చేశారు. కానీ దీనిపై ఇప్పటి వరకు విచారణ జరగలేదు.

విచారణ చేపడితే మరిన్ని వెలుగులోకి...

జిల్లాలో నకిలీ పదో తరగతి మెమోల దందా గుట్టుగా సాగుతోందని సమాచారం. విచారణ చేపడితే గానీ మరిన్ని అక్రమాలు వెలుగులోకి వస్తాయని పలువురు విద్యావేత్తలు, నిరుద్యోగులు అభిప్రాయపడుతున్నారు. ఇప్పటి వరకు వెలుగులోకి వచ్చిన ఘటనపై రాత పూర్వకంగా ఫిర్యాదు చేసినప్పటికీ అధికారులు విచారణ చేపట్టకపోవడం దారుణమనే విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. ఇట్లాంటి అక్రమాల వల్ల నిజమైన నిరుద్యోగ యువతకు అన్యాయం జరుగుతుందనే ఆరోపణలు వస్తున్నాయి.


TTU
TELANGANA TEACHERS UNION

ఆర్‌జేడీకి ఫిర్యాదు చేసిన లేఖ

ప్రభుత్వం మొండి వైఖరి వీడాలి


సమగ్ర శిక్ష ఉద్యోగులకు సంఘీభావం ప్రకటిస్తున్న ఝాన్సీ సౌజన్య

జనగామ కల్చరల్, డిసెంబరు 24(ఆంధ్రజ్యోతి): ప్రభుత్వం మొండి వైఖరి వీడనాడి సమగ్ర శిక్షా ఉద్యోగులతో చర్చలు న్యాయం చేకూర్చాలని సమగ్ర శిక్షా ఉద్యోగుల జేఏసీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఝాన్సీ సౌజన్య అన్నారు. రెగ్యులరైజ్ చేయాలని కలెక్టరేట్ వద్ద ఉద్యోగులు చేపట్టిన నిరవధిక నిరాహార దీక్ష మంగళవారం 15 రోజుకు చేరింది. దీక్షలను సందర్శించిన ఝాన్సీ వారికి సంఘీభావం తెలిపి మాట్లాడారు. సమస్య పరిష్కరించని పక్షంలో కేజీబీవీలలో ఉన్న టీచింగ్ అండ్ నాన్ టీచింగ్ ఉద్యోగులందరినీ సమ్మెలోకి దింపి ఆందోళన తీవ్రతరం చేస్తామన్నారు. విద్యార్థులు పరీక్షలకు సన్నద్ధం కానున్న సమయంలో కేజీబీవీ ఉపాధ్యాయులు సమ్మె చేస్తుండడంతో విద్యాబోధన కుంటుపడిందన్నారు. సమ్మె చేస్తున్న ఉద్యోగుల్లో రోడ్డు ప్రమాదంలో ఒకరు, మనోవేదనతో మరొకరు మృతువ్వాత పడుతున్నా ప్రభుత్వం పట్టించుకోకపోవడం తగదన్నారు. వెంటనే మృతుల కుటుంబాలకు ఎక్స్‌గ్రేషియా ప్రకటించాలని డిమాండ్ చేశారు. సమ్మెకు సంఘీభావం తెలిపిన సీపీఐ జిల్లా కార్యదర్శి సీహెచ్. రాజారెడ్డి మాట్లాడుతూ కాంగ్రెస్ పార్టీ ఓటు బ్యాంకు రాజకీయాలు చేస్తూ కల్లబొల్లి మాటలు చెప్పి అధికారంలోకి వచ్చిందన్నారు. సమగ్ర శిక్ష ఉద్యోగులకు ఇచ్చిన హామీని వెంటనే నెరవేర్చాలన్నారు. రాష్ట్ర నాయకులు యాదగిరి, రుద్రగిరి, సాంబశివరావు పాల్గొన్నారు.

రికార్డు స్థాయిలో పత్తి ధర

» ఈ సీజన్‌లో క్వింటాకు గరిష్ఠంగా రూ.7161

» నిల్వ పెట్టుకునే క్రమంలో స్వల్పంగా పెరుగుతున్న రేటు


కేసముద్రం మార్కెట్‌కు విక్రయానికి వచ్చిన పత్తి

కేసముద్రం, డిసెంబరు 24 (ఆంధ్రజ్యోతి) : కేసముద్రం వ్యవసాయ మార్కెట్లో మంగళవారం పత్తి ధర ఈ సీజన్‌లో అత్యధికంగా క్వింటాకు రూ.7,161గా ధర నమోదైంది. మార్కెట్‌కు 18 మంది రైతులు 111 బస్తాల్లో 44 క్వింటాళ్ల పత్తిని తీసుకువచ్చారు. ఎలక్ట్రానిక్ నేషనల్ అగ్రికల్చర్ మార్కెట్ (ఈ-నామ్) విధానంలోని ఈ-వేలంలో క్వింటాకు గరిష్ఠంగా రూ.7,161, కనిష్ఠంగా రూ.6,333, సగటున రూ.7,001 ధరలతో వ్యాపారులు ఖరీదు చేశారు. స్థానిక రుద్రమదేవి ట్రేడింగ్ కంపెనీ వారు క్వింటాకు గరిష్ఠంగా రూ.7,161 ధర నమోదు చేశారు. ఉమ్మడి జిల్లాలోనే ఈ ధర అత్యధికమని పలువురు వ్యాపారులు చెబుతున్నారు. ఈనెల మొదటి వారంలో సగటు ధర రూ.6,500 నుంచి రూ.6,600 ఉండగా తాజాగా రూ.7వేలకు చేరడం గమనార్హం. పత్తికి పరిమాణాన్ని బట్టి ప్రభుత్వ మద్దతు ధర రూ.7,421 నుంచి రూ.7,521 వరకు ఉంది. పత్తి రాబడులు తగ్గుతున్న క్రమంలో సరుకు నిల్వ పెట్టుకునేందుకు పలువురు వ్యాపారులు పోటీ పడుతుండడంతో డిమాండ్ ఏర్పడి స్వల్పంగా ధర పెరిగినట్లు వ్యాపారులు విశ్లేషిస్తున్నారు.

గాడిద పాలకు భలే గిరాకీ

10 మిల్లీలీటర్లకు రూ.200

'గంగి గోవుపాలు గరిటెడైనను చాలు, కడివడైననేమి ఖరం పాలు' అని అందరూ వేమన పద్యాన్ని చదువుకునే ఉంటారు. కానీ ఇప్పుడు 'గరిటెడైనను చాలు గాడిదపాలు' అనే పరిస్థితి వచ్చింది. గాడిద పాలకు డిమాండ్ పెరిగింది. గాడిద పాలను పిల్లలకు తాపితే దగ్గు, ఆయాసం, ఆకలిలేక పోవడం లాంటివి నయమవుతాయని ప్రజలు నమ్ముతుండటమే దీనికి కారణం. మంగళవారం చిన్నగూడూరు మండలంలోని ఉగ్గంపల్లిలో వరంగల్ నుంచి వచ్చిన ఓ గాడిద పాలవ్యాపారి అక్కడికక్కడే పాలు పితికి 10 మిల్లిలీటర్లకు రూ.200 నుంచి రూ.250 చొప్పున విక్రయించాడు. ఈ సందర్భంగా అతడు మాట్లాడుతూ లీటరు రూ.18వేలు ధర పలుకుతోందని తెలిపాడు. గాడిద రోజుకు 250మిల్లీలీటర్ల నుంచి 300మిల్లీలీటర్ల వరకు వరకు పాలు ఇస్తుందన్నాడు.

- చిన్నగూడూరు, ఆంధ్రజ్యోతి


గాడిద పాలు అమ్ముతున్న వ్యాపారి

అప్పుల బాధతో రైతు ఆత్మహత్య


అనిల్ (ఫైల్)

జఫర్‌గడ్, డిసెంబరు 24(ఆంధ్రజ్యోతి) : అప్పుల బాధ భరించలేక రైతు ఆత్మహత్యకు పాల్పడిన జనగామ జిల్లా జఫర్‌గడ్ మండలం తిమ్మంపేటలో మంగళవారం చోటుసుకుంది. ఎఎస్ఐ వెంకటనారాయణ తెలిపిన ప్రకారం తిమ్మంపేటకు చెందిన నూకల అనిల్ (32) వ్యవసాయం చేసుకుంటూ కుటుంబ జీవనం సాగిస్తున్నాడు. పంటల పెట్టుబడుల కోసం అప్పులు చేశాడు. సరైన దిగుబడులు రాకపోవడంతో తాగుడుకు బానిసయ్యాడు. ఈక్రమంలో మధ్యాహ్నం ఇంట్లో ఎవరూ లేని సమయంలో అనిల్ జీవితంపై విరక్తి చెంది పురుగుల మందు తాగి పడిపోయాడు. బంధువులు అతడిని చికిత్స నిమిత్తం వరంగల్ ఎంజీఎం ఆస్పత్రికి తరలించగా, అప్పటికే మృతి చెందినట్టు వైద్యులు నిర్ధారించారు. భార్య మునీషా ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేస్తున్నారు. మృతుడికి భార్య, కుమారుడు, కుమార్తె ఉన్నారు.

అయ్యగారిపల్లిలో గడ్డివామి దగ్ధం


దగ్ధమవుతున్న గడ్డివామి

ఇనుగుర్తి, డిసెంబరు 24 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని అయ్యగారిపల్లిలో మద్దికుంట్ల యాకన్నకు చెందిన మూడెకరాల గడ్డివాము మంగళవారం దగ్ధమైంది. ఇంటికి సమీపంలోనే ఏర్పాటు చేసుకున్న గడ్డివాముకు నిప్పు అంటుకోవడంతో మహబూబాబాద్ నుంచి అగ్నిమాపక యంత్రం వచ్చి మంటలను చల్లార్చింది. అయితే అప్పటికే గడ్డి పూర్తిగా దగ్ధమైంది. ఈ ఘటనలో రూ.80 వేల విలువైన గడ్డి దగ్ధమైనట్లు బాధితులు తెలిపారు. ఇదిలా ఉండగా గడ్డికి నిప్పు అంటుకున్న విషయంపై అనుమానాలున్నాయని పలువురు గ్రామస్తులు తెలిపారు.

మావోయిస్టుల ప్రాబల్యం తగ్గింది

● అయినా అప్రమత్తత అవసరం

● మల్టీజోన్-2 ఐజీ సత్యనారాయణ


ఆయుధాలను పరిశీలిస్తున్న మల్టీజోన్-2 ఐజీ సత్యనారాయణ

భూపాలపల్లి కృష్ణకాలనీ, డిసెంబరు 24 (ఆంధ్రజ్యోతి): జి ల్లాలో మావోయిస్టుల ప్రాబల్యం తగ్గు ము ఖం పట్టిం దని, అయి నప్పటికీ అప్రమత్తత అవసరమని మల్టీ జోన్ -2 ఐజీ వి.సత్య నారాయణ అన్నారు. భూపా లపల్లిలో ఆయ న మంగళ వారం పర్యటి ంచారు. వార్షిక తనిఖీల్లో భాగంగా జిల్లా పోలీసు కార్యాలయం, ఆర్మ్‌డ్ రిజర్వ్ కార్యాలయం, డీసీఆర్‌బీ, డీపీవో, బాంబు స్క్వాడ్, వివిధ విభాగాలను పరిశీలించారు. ఈ సందర్భంగా ఐజీ మాట్లాడుతూ జిల్లా పరిధిలోని పలిమెల మండలం జిల్లా సరిహద్దులుగా మహారాష్ట్ర, ఛత్తీస్‌గఢ్ ఉన్నాయని, మహదేవపూర్, కాళేశ్వరం ఠాణాలు సిరోంచకు దగ్గరలో ఉన్న నేపథ్యంలో నిరంతరం అప్రమత్తంగా ఉండాలని సూచిం చారు. ఎస్పీ కిరణ్‌ఖరే నేతృత్వంలో లాండ్‌అండ్‌ఆర్డర్‌తో పాటు అన్ని వింగ్‌ల పనితీరు సంతృప్తికరంగా ఉందని ప్రశంసించారు. సైబర్ నేరాలు రోజుకూ పెరుగుతున్నాయని, వాటిపై అవగాహన కలిగి ఉండాలని అన్నారు. ప్రజలతో స్నేహపూర్వకంగా ఉండాలని, నేరస్థులతో మాత్రం కఠినంగానే వ్యవహరించాలని సూచించారు. శాంతి భద్రతల పరిరక్షణలో రాజీ లేకుండా పని చేయాలన్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా అదనపు ఎస్పీలు బోనాల కిషన్, వేవల శ్రీనివాస్, డీఎస్పీలు సంపత్‌రావు, రామ్మోహన్‌రెడ్డి, నారాయణ నాయక్, జిల్లా పరిధిలోని పోలీస్ అధికారులు పాల్గొన్నారు.

ప్లాస్టిక్ నిర్మూలన.. మూణ్నాళ్ల ముచ్చటేనా?

» మళ్లీ పెరిగిన వినియోగం

» పట్టించుకోని అధికారులు

మరిపెడ రూరల్, డిసెంబరు 24(ఆంధ్రజ్యోతి): ప్లాస్టిక్ కవర్ల వాడకంతో పర్యావరణానికి ముప్పు కలుగుతుందని ప్రభుత్వం రెండేళ్ల క్రితం వాటి వాడకాన్ని నిషేధించింది. ఈ క్రమంలోనే జిల్లాలోని అన్ని మున్సిపాలిటీ కేంద్రాలతోపాటు మండల కేంద్రాలలోనే వ్యాపారులకు, వినియోగదారులందరికీ తగిన సూచనలు చేశారు. ప్లాస్టిక్‌ను వాడడం ముప్పు.. గుడ్డ(కాటన్ కవర్ల) సంచులను వాడడమే కరెక్ట్ అని నినాదాలు కూడా రాయించారు. నిబంధనలు అతిక్రమించిన వ్యాపారులపై పెద్ద మొత్తంలో జరిమానాలు సైతం విధించారు. దీంతో కొద్ది కాలం ప్లాస్టిక్ కవర్ల ఉపయోగం తగ్గిపోయింది. కానీ, మళ్లీ జిల్లాలోనే అన్ని పట్టణ కేంద్రాలతో పాటు గ్రామాలలో కూడా ప్లాస్టిక్ ఉపయోగం పెరిగిపోయింది. అయినా అధికారులలో ఉలుకుపలుకు లేదు. పన్నుల వసూలుపై ఉన్నశ్రద్ధ.. ప్రజాహితంపై లేదని పలువురు వాపోతున్నారు. ఇప్పటికైనా అధికారులు స్పందించి ప్లాస్టిక్ వినియోగాన్ని నిర్మూలించడానికి చర్యలు చేపట్టాలని, పర్యావరణాన్ని కాపాడాలని ప్రజలు కొరుకుంటున్నారు.


ప్లాస్టిక్ కవర్లతో కూరగాయలు తీసుకువెళ్తున్న దృశ్యం(ఫైల్)

ప్లాస్టిక్ కవర్లు విక్రయించిన వారిపై కఠిన చర్యలు

నరేష్‌రెడ్డి, మునిసిపల్ కమిషనర్ మరిపెడ

ప్లాస్టిక్ కవర్లు విక్రయించిన వారిపై కఠిన చర్యలు తీసుకుంటాం. దుకాణాలలో ప్లాస్టిక్ కవర్లు లభ్యమైతే ఆ దుకాణదారులకు రూ. 500 నుంచి రూ25 వేల వరకు జరిమానా విధిస్తాం.

రామప్ప కామేశ్వరాలయంలో సాయిల్ టెస్ట్

వెంకటాపూర్, డిసెంబరు 24 (ఆంధ్రజ్యోతి): ములుగు జిల్లా వెంకటాపూర్ మండలంలోని ప్రఖ్యాత రామప్ప దేవాలయం ప్రాంగణంలోని కామేశ్వరాలయ పునర్నిర్మాణం కోసం సాయిల్ టెస్ట్ పనులను మంగళవారం ప్రారంభమయ్యాయి. 2022లో రాష్ట్రపతి ద్రౌపదిముర్ము ఈ పనుల కోసం శిలాఫలకాన్ని ఆవిష్కరించారు. ఈ క్రమంలో రూ.11కోట్ల నిధులు మంజూరయ్యాయి. వేసవిలో పూర్తిగా కామేశ్వరాలయ రాళ్లను, ఇసుకను తొలగించగా వర్షాకాలంలో పనులు నిలిచిపోయాయి. మంగళవారం పునర్నిర్మాణం చేపట్టేముందు ప్లేట్‌లోడ్ టెస్ట్ (సాయిల్ స్ట్రెంత్) కోసం సెట్ చేస్తున్నారు.

వినియోగదారుల రక్షణ చట్టాలపై అవగాహన కల్పించాలి

● మహబూబాబాద్ అదనపు కలెక్టర్ వీరబ్రహ్మాచారి

మహబూబాబాద్, డిసెంబరు 24 (ఆంధ్రజ్యోతి) : వినియోగదారుల రక్షణ చట్టాలపై ప్రజల్లో అవగాహన కల్పించాలని జిల్లా అదనపు కలెక్టర్ కె.వీరబ్రహ్మాచారి సూచించారు. మహబూబాబాద్ జిల్లా కలెక్టర్ కార్యాలయంలో మంగళవారం జిల్లా పౌరసరఫరాల శాఖ ఆధ్వర్యంలో జాతీయ వినియోగదారుల హక్కుల దినోత్సవాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వినియోగదారుల రక్షణ చట్టం 1986 డిసెంబరు 24న అమలులోకి వచ్చిందని, వినియోగదారుల ప్రయోజనాలను పరిరక్షించడానికి వినియోగదారుల ఫోరంలు చక్కగా పని చేస్తున్నాయని తెలిపారు. డిజిటల్ విధానం, వర్చువల్ విచారణల ద్వారా సత్వర న్యాయం అందేలా సంఘాలు పని చేయాలని సూచించారు. వినియోగదారులు ఆహార పదార్థాలు, నగలు, ఇతర ఏ వస్తువులైనా కొనుగోలు చేసే సమయంలో ధర, నాణ్యత ప్రమాణాలు తెలుసుకుని కొనుగోలు చేయాలన్నారు. ఎక్కడైనా అన్యాయం జరిగితే సత్వరమే వినియోగదారుల ఫోరంలో అర్జీపెట్టి, న్యాయ పరంగా నష్ట పరిహారం పొందాలన్నారు. రాష్ట్ర వ్యాప్తంగా వినియోదారుల హక్కులు, చట్టాలపై అన్ని వినియోగదారుల సంఘాలు కృషి చేస్తున్నాయని చెప్పారు. ప్రజలతో పాటు పాఠశాలలు, కళాశాలల్లో విద్యార్థులకు కూడా వినియోగదారుల చట్టాలపై చైతన్యం కల్పించాలన్నారు. ముఖ్యంగా ఆహార తనిఖీల్లో సంబంధిత శాఖాధికారులు నిరంతరం తనిఖీలు చేపట్టాలన్నారు. వినియోగదారులు ఎక్కడా నష్టపోకుండా నాణ్యమైన వస్తువులు కొనుగోలు చేయాలని, నకిలీ వస్తువుల మోసాల నుంచి బయట పడాలంటే వినియోదారుల్లో చైతన్యం నింపాలన్నారు. వినియోగదారుల సంఘాల సూచనలు, సలహాలు తప్పక పరిగణలోకి తీసుకుంటామని చెప్పారు. ఈ సమావేశంలో జిల్లా అధికారులు ప్రేమ్‌కుమార్, కృష్ణవేణి, వినియోగదారుల సంఘాల బాధ్యులు సుధాకర్, జానీ, విజయ్‌కుమార్, శ్రీనివాస్, సత్యనారాయణ పాల్గొన్నారు.


సమావేశంలో మాట్లాడుతున్న వీరబ్రహ్మాచారి

సీబీసీ.. వేడుకలకు ముస్తాబు..



క్రిస్మస్ వేడుకల కోసం విద్యుత్‌దీపాలతో ముస్తాబైన సీబీసీ చర్చి

రాష్ట్రంలో రెండో అతిపెద్ద చర్చిగా గుర్తింపు

విశాలమైన ప్రార్థనామందిరం ఇక్కడి ప్రత్యేకత

ఖిలావరంగల్, డిసెంబరు24 (ఆంధ్రజ్యోతి): వరంగల్ క్రిస్టియన్‌కాలనీలోని సెంటినరీ బాప్టిస్టు చర్చి క్రిస్మస్ వేడుకలకు సిద్ధమైంది. సెంటినరీ బాప్టిస్టు చర్చిల్లో రాష్ట్రంలోని రెండో అతిపెద్ద చర్చిగా గుర్తింపు ఉంది. ఇటీవలే దీన్ని ప్రభుత్వ నిధులతో పాటు, దాతల సహకారంతో సుమారు రూ.60కోట్లు ఖర్చుపెట్టి ఆధునికీకరించారు. ఇందులో విశాలమైన డూప్లెక్స్ (రెండు అంతస్తుల) భవనంతో పాటు, విశాలమైన ప్రార్థనామందిరం నిర్మించారు. సౌండ్ ప్రూఫ్ సిస్టంతో పాటు ఒకేసారి 10వేల మంది ప్రార్థన చేసేలా ఏర్పాట్లు చేశారు. ఇక్కడ క్రిస్మస్ వేడుకులకు దేశవిదేశాలకు చెందిన క్రిస్టియన్లు వస్తుంటారు.

1893లో నిర్మాణం..

వరంగల్ క్రిస్టియన్‌కాలనీలో 1893 సంవత్సరం, అక్టోబరు 1న, 20 మంది సంఘపెద్దలు కలిసి తొమ్మిదెకరాల స్థలంలో సీబీసీని నిర్మించారు. 1956లో సెంటినరీ బిల్డింగ్, పాస్టర్, పార్సనేర్ల కోసం నివాసాలను ఏర్పాటు చేశారు. నాలుగు సంవత్సరాలుగా ప్రభుత్వంతో పాటు, సంఘం సభ్యులు 5వేల మంది దాతల సహాయంతో సుమారు రూ.10 కోట్లు ఖర్చుపెట్టి పునఃనిర్మించా రు. ఇందులో ప్రతీ ఆదివారం ప్రార్థనలు, మంగళవారం స్త్రీలఆరాధన, బుధవారం సంఘం ఆరాధన, గురువారం కుటీరప్రార్థన, శుక్రవారం ఉపవాస ప్రార్థన, శనివారం యూత్ ఫెలోషిప్‌తో పాటు యేటా డిసెంబరు రెండో వారం స్త్రీల క్రిస్మస్‌ను జరుపుకుంటారు. ఈ నెల 22న, చిల్డ్రన్ ఫెస్టివల్, 23న యూత్ ఫెస్టివల్, 24న, వాచ్‌నైట్ సర్వీస్, 25న క్రిస్మస్, జనవరి 1న నూతనసంవత్సర వేడుకలు ఘనంగా జరిపేందుకు ఏర్పాట్లు చేశారు. సీబీసీ ఆధ్వర్యంలో బెతెస్థా బాప్టిస్టు చర్చి-లక్ష్మీపురం, బరకా బాప్టిస్టు చర్చి, గోవిందాపురం, కొండాపురం, మూడుచెక్కల పల్లి, నల్లబెల్లి, ఓటాయి, ఎల్లాయిగూడెం, బెత్లెహం బాప్టిస్టు చర్చిలున్నాయి. సీబీసీ సీనియర్ పాస్టర్‌గా జగ్జీవన్‌బాబ్జి, అధ్యక్షుడిగా పీఆర్ సాల్మన్, ప్రధానకార్యదర్శిగా కొల్లూరి రాజ్‌కుమార్, కోశాధికారిగా కొల్లూరి కవిరాజ్(టోని), ఉపాధ్యక్షుడిగా మేకల భరత్‌కుమార్, సంయుక్త కార్యదర్శిగా పొలెపాక శ్రీకర్, సంయుక్త కోశాధి కారిగా కొల్లూరి విశాల్, కార్యవర్గ సభ్యులుగా బసికే నవీన్‌సన్, మేకల ప్రభాకర్, గుండేటి శ్యామ్‌కుమార్,పల్లె ఉదయ్, పిలెపాక ఉదయ్ కుమార్, వస్కుల యోహాన్ కొనసాగుతున్నారు.



పర్యాటక ప్రాంతంగా..

క్రిస్మస్ వేడుకల కోసం చర్చిని సర్వాంగ సుందరంగా ముస్తాబుచేశాం. 131 సంవత్సరాల చరిత్ర కలిగిన సెంటినరీ బాప్టిస్టు చర్చి(సీబీసీ) నూతన భవనం రాష్ట్రంలోనే అతిపెద్ద చర్చిల్లో రెండో స్థానంలో ఉంది. ఇందులో ఒకేసారి 10వేల మంది ప్రార్థన చేయవచ్చు. తెలంగాణ, ఆంధ్రప్రదేశ్‌తో పాటు దేశవిదేశాలనుంచి ఇక్కడికి క్రిస్టియన్లు వస్తుంటారు.

\- పుల్లా జగ్జీవన్ బాబ్జీ, పాస్టర్



క్రిస్టియన్‌కాలనీలోని సెంటినరీ బాప్టిస్టు చర్చి



మహబూబాబాద్ జిల్లా డోర్నకల్‌లోని సీఎస్ఐ చర్చి

మత సామరస్యానికి ప్రతీక సీఎస్ఐ చర్చి

- సర్వ మతాల నిర్మాణశైలి ఇక్కడి ప్రత్యేకత
- నాడు బ్రిటీష్ పాలకుల సహాయాన్ని తిరస్కరించిన అజరయ్య

డోర్నకల్, డిసెంబరు 24 (ఆంధ్రజ్యోతి) : ప్రధాన మతాలైన హిందూ, ముస్లిం, క్రైస్తవ మతాల ప్రార్థన మందిరాల నిర్మాణ శైలితో పాటు ఆయా మతాల మనోభావాలను పరిగణనలోకి తీసుకుని నిర్మించిన డోర్నకల్‌లోని చరిత్రాత్మక సీఎస్ఐ చర్చి మత సామరస్యానికి ప్రతీకగా నిలుస్తోంది. 1915 సంవత్సరంలో జనవరి 14న అప్పటి మద్రాసు బిషప్ హెన్రీ వైట్ హెడ్ చేతుల మీదుగా శంకుస్థాపన జరగ్గా.. సుమారు 24 ఏళ్ల పాటు పనులు కొనసాగాయి. 1939 జనవరి 6వ తేదీ ఎతిఫనీ దినోత్సవం రోజున అప్పటి భారత క్రైస్తవ సభ అధ్యక్షుడు బిషప్ ఫాస్ వెస్ట్‌కాట్ ఈ చర్చిని ప్రారంభించారు. ఈ క్రమంలో ఈ చర్చిని ఎతిఫనీ కెతిడ్రల్ చర్చి అంటారు. భారతీయ సంస్కృతి, సంప్రదాయాలను మిళితం చేస్తూ.. ప్రధాన మతాల మనోభావాలకు అనుగుణంగా తమిళనాడుకు చెందిన బిషప్ అజరయ్య ఈ చర్చిని నిర్మించారు. ముఖ్యంగా ద్రావిడ (దక్షిణ) భారతదేశ ప్రార్థన మందిర నిర్మాణాలను పోలి ఉండేలా ఆకృతులను రూపొందించారు. చర్చి నిర్మాణం కోసం ఆస్ట్రేలియా, బర్మ (ప్రస్తుత మయన్మార్) సిలోన్ (శ్రీలంక), అమెరికా దేశాలకు చెందిన అజరయ్య మిత్రులు, దేశంలోని క్రైస్తవ విశ్వాసులు చర్చి నిర్మాణం కోసం ఆర్థికసాయం అందించారు.



విద్యుద్దీపాల వెలుగుల్లో డోర్నకల్ సీఎస్ఐ చర్చి

స్వాతంత్ర్య కాంక్షకు అనుగుణంగా..

నాడు ప్రజల్లో బలంగా నాటుకుపోయి ఉన్న స్వాతంత్ర్య కాంక్షను నిర్దాక్షిణంగా అణిచివేత సాగిస్తున్న బ్రిటన్ ప్రభుత్వం, దేశస్తులు చర్చి నిర్మాణం కోసం ఇస్తామన్న నిధులను.. అజరయ్య సున్నితంగా తిరస్కరించారు. చర్చి నిర్మాణానికి నిధుల కంటే స్వాతంత్ర్యం ఇవ్వాలంటూ వారి ముందే కుండబద్ధలు కొట్టినట్టుగా చెప్పారు. చర్చి నిర్మాణంలో భాగంగా ప్రధాన ప్రార్థన మందిరాన్ని ఏసుక్రీస్తు ప్రియశిశ్యులైన 12 మంది విశ్వాసులను స్ఫురించే విధంగా 12 పిల్లర్లతో చర్చిని నిర్మించారు. పిల్లర్ల నిర్మాణ ఆకృతి.. మధురైలోని మీనాక్షి దేవాలయ పిల్లర్ల నమూనాలో ఉంటాయి. అలాగే చర్చిపై ఉన్న రెండు ప్రధాన గోపురాలు హిందూ ముస్లిం ప్రార్థనమందిరాల నిర్మాణశైలీలో మిళితమై ఉంటాయి. చర్చి ప్రధాన ద్వారం హిందూ దేవాలయాల సింహద్వారాన్ని కలిగి ఉంటుంది. చర్చి రక్షణ కొరకు చివరన సూదుల్లా మొనదేలి ఉన్న ఇత్తడి లోహంతో తయారు చేసిన గోళాకారం ఆకృతులను ప్రధాన ద్వారానికి బిగించారు. చర్చి సర్వమతాల సమ్మేళనంగా ఉండాలని భావించిన అజరయ్య ఆ విధంగానే చర్చిని నిర్మించారు. కాగా, బుధవారం క్రిస్మస్ పండుగను పురస్కరించుకుని చర్చిని రంగురంగుల విద్యుత్ దీపాలతో అలంకరించారు. తెల్లవారుజామున చర్చిలో డోర్నకల్ సీఎస్ఐ బిషప్ రైట్.రెవ. కోడిరెక్క పద్మారావు దైవసందేశం అందిస్తారు.

గురుకుల ఉపాధ్యాయుడి సృజనాత్మకత



చాక్‌పీస్‌లపై శాంతాక్లాజ్, నక్షత్రాల బొమ్మలు

నిత్యం పాఠాలు బోధిస్తూ బిజీగా ఉండే ఓ ఉపాధ్యాయుడు తనలోని సృజనాత్మతకు పదును పెడుతున్నారు. చాక్‌పీస్‌లతో బొమ్మలను చెక్కి ఔరా అనిపిస్తున్నారు.. భూపాలపల్లి జిల్లా కాటారం మండల కేంద్రంలోని గిరిజన సంక్షేమ బాలుర గురుకులానికి చెందిన ఆర్ట్ టీచర్ రజినీకాంత్. క్రిస్మస్ పండుగ సందర్భంగా ఆయన చాక్‌పీస్‌లతో శిలువపై ఏసుక్రీస్తు, శాంతాక్లాజ్, స్టార్ బొమ్మలతో పాటు హ్యాపీ క్రిస్మస్ అనే అక్షరాలను చెక్కి అబ్బురపరిచారు. ఈ సందర్భంగా ఆయన్ను తోటి ఉపాధ్యాయులు, స్థానికులు అభినందించారు.

\- కాటారం, ఆంధ్రజ్యోతి

క్రిస్మస్ కాంతులు

విద్యుత్ కాంతులతో వెలిగిన చర్చీలు



పశువుల పాకలో బాల యేసు

క్రిస్మస్ పండుగను పురస్కరించుకొని చర్చీలను అందంగా ముస్తాబుచేశారు. విద్యుత్ దీపాలతో సుందరంగా అలంకరించారు. రంగురంగుల కాంతులతో ప్రార్థనాలయాలు దేదీప్యమానంగా వెలిగిపోయాయి. అర్ధరాత్రి నుంచే ప్రారంభమైన క్రిస్మస్ వేడుకల్లో క్రైస్తవులు పాల్గొని ప్రార్థనలు చేశారు. కేకులు కట్ చేసి పరస్పర శుభాకాంక్షలు తెలుపుకున్నారు.



కాజీపేట పాతిమా చర్చి



విద్యుత్ వెలుగులతో వరంగల్ లేబర్‌కాలనీలోని సీబీసీ చర్చి



హనుమకొండలోని సీబీసీ చర్చి



మేడారం సమావేశంలో మాట్లాడుతున్న మంత్రి సీతక్క

మేడారంలో మెరుగైన సౌకర్యాలు కల్పిస్తాం

- రహదారుల నిర్మాణం, అంతర్గత గుడుల పునరుద్ధరణకు శ్రీకారం
- రాష్ట్ర పంచాయతీ రాజ్, గ్రామీణ అభివృద్ధి శాఖ మంత్రి సీతక్క
- రూ. 22.75 కోట్ల అభివృద్ధి పనులకు శంకుస్థాపన

మేడారం, డిసెంబరు 24 (ఆంధ్రజ్యోతి) : మేడారం భక్తులకు మెరుగైన సౌకర్యాలు కల్పించేందుకు అభివృద్ధి పనులు చేపడుతున్నామని రాష్ట్ర పంచాయతీ రాజ్, గ్రామీణాభివృద్ధి, స్త్రీ శిశు సంక్షేమ శాఖ మంత్రి సీతక్క అన్నారు. రూ. 22.75 కోట్లతో మేడారంలో చేపట్టనున్న శాశ్వత పనులకు మంత్రి మంగళవారం శంకుస్థాపనలు చేశారు. రూ.2.75 కోట్లతో వీఐపీ పార్కింగ్ రోడ్డు, రూ.2 కోట్లతో ఊరట్టం, రూ.2 కోట్లతో సారలమ్మ స్వాగత తోరణం నుంచి కన్నెపల్లి సారలమ్మ గుడి వరకు, రూ. 2.50కోట్లతో కాల్వపల్లి క్రాస్ నుంచి గ్రామం వరకు, రూ.1.30కోట్లతో మ్యూజియం నుంచి నారింజ బందం వరకు రోడ్లు, రూ.1.92కోట్లతో అంతర్గత గుడుల పునరుద్ధరణ, రూ.3.08 కోట్లతో క్యూలైన్లపై షెడ్ల నిర్మాణ పనులకు శంకుస్థాపనలు చేశారు. అనంతరం గద్దెల ప్రాంగణంలో కార్య నిర్వాహణ అధికారి రాజేంద్రం అధ్యక్షతన పూజారులతో జరిగిన సమావేశంలో ఆమె మాట్లాడారు. తల్లులను దర్శించుకునేందుకు మేడారం వచ్చే భక్తులకు రహదారుల నిర్మాణం, ఇతర మౌలిక సౌకర్యాల కోసం అభివృద్ధి పనరులకు శ్రీకారం చుట్టామని అన్నారు. ఇందుకు ప్రభుత్వం రూ. 22.75కోట్ల నిధులు మంజూరయ్యాయని తెలిపారు. రోడ్ల మరమ్మతులు, అంతర్గత గుడుల పునరుద్ధరణ, క్యూలైన్లపై షెడ్ల నిర్మాణం తదితర అభివృద్ధి పనులు చేపడుతున్నామన్నారు.

వీటిలో నాణ్యతా ప్రమాణాలు పాటించాలని, తేడాలు వస్తే చర్యలు తప్పవని హెచ్చరించారు. త్వరలోనే మరిన్ని అభివృద్ధి పనులకు ప్రణాళికలు రూపొందించి ప్రారంభిస్తామని హామీ ఇచ్చారు. జంపన్నవాగు పరిసర ప్రాంతాల్లో డ్రెయినేజీ, సెంట్రల్ లైటింగ్, ఫుట్‌పాత్ నిర్మాణానికి గ్రామస్థులు సహకరించాలని కోరారు. అటవీ శాఖ అభ్యంతరాలతో కొండాయి - మేడారం రోడ్డు నిర్మాణం నిలిచిపోయిందని, సంబంధిత శాఖ మంత్రి కొండా సురేఖతో మాట్లాడి అనుమతులు తెప్పించి పూర్తి చేయిస్తానని తెలిపారు.

అమిత్‌షాను బర్తరఫ్ చేయాలి

- కేంద్ర మంత్రితో ప్రధాని బహిరంగ క్షమాపణ చెప్పించాలి
- రాజ్యాంగంపై గౌరవం లేని కేంద్రం.. రిజర్వేషన్లను ఎత్తివేసే కుట్ర
- మాజీ ఉప ముఖ్యమంత్రి, ఎమ్మెల్యే కడియం శ్రీహరి



కేంద్ర మంత్రి పదవి నుంచి అమిత్‌షాను తొలగించాలని రాష్ట్రపతి ద్రౌపది ముర్ముకు రాసిన లేఖలను కలెక్టర్ ప్రావీణ్యకు అందజేస్తున్న ఎమ్మెల్యేలు కడియం, నాగరాజు, నాయిని

వడ్డెపల్లి, డిసెంబరు 24 (ఆంధ్రజ్యోతి): భారత రాజ్యాంగ నిర్మాత డాక్టర్ బీఆర్ అంబేద్కర్‌ను పార్లమెంట్ సాక్షిగా అవమాన పరుస్తూ అనుచిత వ్యాఖ్యలు చేసిన కేంద్ర హోం మంత్రి అమిత్‌షాను వెంటనే బర్తరఫ్ చేయాలని మాజీ ఉప ముఖ్యమంత్రి, స్టేషన్ ఘన్‌పూర్ ఎమ్మెల్యే కడియం శ్రీహరి డిమాండ్ చేశారు. ఏఐసీసీ, పీసీసీ ఆదేశాల మేరకు కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో హనుమకొండ పబ్లిక్ గార్డెన్ ప్రాంతంలోని అంబేద్కర్ విగ్రహం వద్ద పశ్చిమ ఎమ్మెల్యే నాయిని రాజేందర్‌రెడ్డి, వర్ధన్నపేట ఎమ్మెల్యే కేఆర్. నాగరాజు, కుడా ఛైర్మన్ ఇనగాల వెంకట్రాంరెడ్డి, గ్రంథాలయ సంస్థ ఛైర్మన్ ఎం.డి. అజీజ్‌ఖాన్‌లతో కలిసి కాంగ్రెస్ శ్రేణుల పెద్దఎత్తున మంగళవారం నిరసన ప్రదర్శన నిర్వహించారు. తొలుత అంబేద్కర్ విగ్రహానికి పూలమాలలు వేశారు. ఈ సందర్భంగా కడియం శ్రీహరి మాట్లాడుతూ.. కేంద్ర మంత్రి అమిత్‌షాతో ప్రధాని నరేంద్రమోదీ బహిరంగ క్షమాపణ చెప్పించాలని అన్నారు. కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం ప్రజాస్వామ్యాన్ని ఖూనీ చేస్తూ రిజర్వేషన్లను ఎత్తివేసేందుకు కుట్ర పన్నుతోందని దుయ్యబట్టారు. భారత రాజ్యాంగంపై కేంద్ర ప్రభుత్వానికి ఏమాత్రం గౌరవం లేదని విమర్శించారు. బడుగు, బలహీన వర్గాలకు కాంగ్రెస్ లెజెండ్ అని అన్నారు. అంబేద్కర్ రాసిన రాజ్యాంగం లేకపోతే ఈ దేశంలోని అట్టడుగు వర్గాల పరిస్థితి ఏ విధంగా ఉండేదోనని ఆవేదన వ్యక్తం చేశారు. అంబేద్కర్‌ను అవమానించడమంటే భారత జాతిని అవమానించడమేనని, అన్ని మతాలను కించపర్చేందుకు బీజేపీ ప్రభుత్వం కుయుక్తులు పన్నుతోందని విమర్శించారు. అంబేద్కర్ దైవంతో సమానమని, తమ దేవుడిని కించపరిస్తే తగిన బుద్ధి చెబుతామని అన్నారు. అధికార మదంతో అమిత్‌షా చేసిన వ్యాఖ్యలను ఖండిస్తున్నట్లు చెప్పారు. ఎమ్మెల్యే నాయిని రాజేందర్‌రెడ్డి మాట్లాడుతూ.. బీజేపీ ప్రభుత్వం మొదటి నుంచి మతతత్వాన్ని ప్రేరేపిస్తూ కాంగ్రెస్ పార్టీపై విషం చిమ్ముతోందని అన్నారు. అంబేద్కర్‌ను అవమానపర్చిన అమిత్‌షాను వెంటనే మంత్రివర్గం నుంచి బర్తరఫ్ చేయాలని, దేశ ప్రజలకు క్షమాపణ చెప్పించాలని డిమాండ్ చేశారు. ఎమ్మెల్యే కేఆర్ నాగరాజు మాట్లాడుతూ.. జై భీమ్ అంటే బీజేపీ నేతలకు గుండెదడ వస్తోందని, కేంద్ర హోం మంత్రి అమిత్‌షా మతతత్వ భావజాలాన్ని మార్చుకోవాలని అన్నారు. అమిత్‌షాపై కేంద్ర ప్రభుత్వం స్పందించాలని, లేదంటే బీజేపీ నేతలను గ్రామాల్లో తిరగనివ్వబోమని హెచ్చరించారు. రాముడు మాకూ దేవుడేనని నాగరాజు స్పష్టం చేశారు. ఈ నిరసన ప్రదర్శనలో టీపీసీసీ సభ్యులు బత్తిని శ్రీనివాసరావు, ఈవీ శ్రీని వాసరావు, రాష్ట్ర , జిల్లా నాయకులు బొద్దిరెడ్డి ప్రభాకర్‌రెడ్డి, కూచన రవళి, బంక సరళ సంపత్ యాదవ్, పెరుమాండ్ల రామకృష్ణ, మీర్జా అజీజ్ ఉల్లా బేగ్, ఎనుకొంటి నాగరాజు, మండల సమ్మయ్య, బిన్ని లక్ష్మణ్, మహ్మద్ అంకూస్, నాయిని లక్ష్మారెడ్డి, పింగిళి వెంకటనర్సింహారెడ్డి, ఎంపీ ఆనంద్, పులి అనిల్‌కుమార్, కొండ నాగరాజు తదితరులు పాల్గొన్నారు. అనంతరం కేంద్ర మంత్రి వర్గం నుంచి అమిత్‌షాను తొలగించాలని రాష్ట్రపతి ద్రౌపది ముర్ముకు రాసిన లేఖను హనుమకొండ జిల్లా కలెక్టర్ పి. ప్రావీణ్యకు అందించారు.

కొత్తకొండ జాతరను విజయవంతం చేద్దాం..

- జనవరి 10 నుంచి 18 వరకు జాతర
- అన్ని శాఖల అధికారులు సమన్వయంతో పనిచేయాలి
- హనుమకొండ జిల్లా కలెక్టర్ ప్రావీణ్య



కొత్తకొండ ఆలయంలో ప్రత్యేక పూజలు చేస్తున్న జిల్లా కలెక్టర్ ప్రావీణ్య

భీమదేవరపల్లి, డిసెంబరు 24 (ఆంధ్రజ్యోతి): ఉత్తర తెలంగాణ జిల్లాలో ప్రసిద్ధిగాంచిన కొత్తకొండ వీరభద్రస్వామి జాతరను విజయవంతం చేద్దామని కలెక్టర్ ప్రావీణ్య పేర్కొన్నారు. మంగళవారం ఆలయ ఈవో కిషన్‌రావు అధ్యక్షతన ఆలయ ఆవరణలోని కల్యాణ మండపంలో వివిధ శాఖల అధికారులతో కలెక్టర్ ప్రావీణ్య సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ ప్రావీణ్య మాట్లాడుతూ.. కొత్తకొండలోని వీరభద్రస్వామి ఆలయంలో జనవరి 10 నుంచి జాతర బ్రహ్మోత్సవాలు జరుగుతాయన్నారు. ఉత్సవాలకు జిల్లాలోని పోలీసు, రెవెన్యూ, వైద్య, ఆరోగ్య శాఖ, పంచాయతీరాజ్, గ్రామీణాభివృద్ధి, రోడ్లు, భవనాలు, విద్యుత్, దేవాదాయ, పర్యాటక, రవాణా, ఎక్సైజ్, పశుసంవర్ధక శాఖ తదితర శాఖల అధికారులు బాధ్యతగా సమన్వయంతో భక్తితో ఉత్సవాలను విజయవంతం చేయాలన్నారు. కొత్తకొండ దేవాలయం ఎంతో చారిత్రాత్మకమైందని, దేవాలయ ప్రతిష్ఠతను గ్రామానికి, మండలానికి, జల్లాకు పరిమితం కాకుండా రాష్ట్రవ్యాప్తంగా తెలియజేయాలన్నారు. జాతరకు వచ్చే భక్తులకు ఎలాంటి ఇబ్బందులు కలుగకుండా అధికారులు సమన్వయంతో చర్యలు చేపట్టాలన్నారు. బాధ్యతలు సక్రమంగా నిర్వహించాలన్నారు. జాతర ఏర్పాట్ల విషయంలో నిర్లక్ష్యం చేయకుండా ఏర్పాట్లు చేయాలన్నారు. జాతరకు వచ్చే భక్తుల కోసం ఆర్టీసీ అధికారులు బస్సుల సంఖ్య పెంచాలన్నారు. జాతరలో నిరంతరం వైద్య సేవలు, పశువైద్య సేవలు అందించే విధంగా వైద్య, ఆరోగ్య శాఖ, పశువైద్య అధికారులు ఏర్పాట్లు చేయాలన్నారు. రోడ్డు మరమ్మతులను ఆర్‌అండ్‌బీ శాఖ అధికారులు చేపట్టాలన్నారు. శాంతి భద్రతలు కాపాడేందుకు పోలీసులు చర్యలు చేపట్టాలన్నారు. కాగా, కొత్తకొండ శ్రీవీరభద్రస్వామి దేవాలయంలో కలెక్టర్ ప్రావీణ్య మంగళవారం ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఆలయానికి వచ్చిన కలెక్టర్ ప్రావీణ్యకు ఆలయ అర్చకులు, ఈవో కిషన్‌రావు పూర్ణకుంభంతో స్వాగతం పలికారు. ఆలయం చుట్టూ ప్రదక్షిణలు చేసిన అనంతరం వీరభద్రస్వామిని దర్శించుకొని పూజలు చేశారు. అనంతరం కలెక్టర్ ప్రావీణ్యను ఆలయ ఈవో కిషన్‌రావు స్వామివారి ప్రసాదాన్ని అందజేశారు. ఈ సమావేశంలో ఆర్డీవో రమేష్ రాథోడ్, కాజీపేట ఏసీపీ తిరుమల్, ఆలయ ఈవో కిషన్‌రావు, జిల్లా వైద్య ఆరోగ్య శాఖ అధికారి అప్పయ్య, డీపీవో లక్ష్మీరమాకాంత్, ఆర్టీసీ ఆర్ఎం విజయభాను, ఎక్సైజ్ అధికారి చంద్రశేఖర్, చైల్డ్ వెల్ఫేర్ అధికారి జయంతి, ఆర్‌అండ్‌బీ ఈఈ సురేష్‌బాబు, డీపీఆర్వో జీవీ భానుప్రసాద్, సీఐ పులి రమేష్, ఎస్ఐ సాయిబాబు, ఎంపీడీవో వీరేశం, తహసీల్దార్ ప్రవీణ్, పశువైద్యాధికారి డాక్టర్ మాలతిరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా ప్రీ క్రిస్మస్ వేడుకలు



కురవిలో కాంగ్రెస్ మండల అధ్యక్షుడు వీరభద్రం



డోర్నకల్ మునిసిపల్ చైర్మన్ వాంకుడోతు వీరన్న



ఇందిరానగర్‌లో ఎమ్మెల్యే భూక్య మురళీనాయక్



మరిపెడ సెమీ క్రిస్మస్ వేడుకలో మాట్లాడుతున్న ప్రభుత్వవిప్ రాంచంద్రునాయక్

మహబూబాబాద్ టౌన్, డిసెంబరు 24 (ఆంధ్రజ్యోతి) : జిల్లాలో ప్రీక్రిస్మస్ వేడుకలు మంగళవారం ఘనంగా జరుపుకున్నారు. కేక్‌ను కట్‌చేసి ఏసుక్రీస్తు బోధనలు వివరించారు. ఇందులో భాగంగా మహబూబాబాద్ జిల్లా కేంద్రంలోని ఇందిరానగర్ షారోన్ చర్చిలో సోమవారం రాత్రి సీసీవోసీ కమిటీ ఆధ్వర్యంలో ప్రీ క్రిస్మస్ వేడుకలను నిర్వహించారు. ముఖ్యఅతిథిగా హాజరైన ఎమ్మెల్యే మురళీనాయక్ మాట్లాడుతూ ఏసుక్రీస్తు బోధనలను పాటించి ప్రశాంత జీవనం గడపాలన్నారు. ఈ సందర్భంగా నూతన సంవత్సర, క్రిస్మస్ శుభాకాంక్షలు తెలిపారు. అనంతరం ప్రీ క్రిస్మస్ వేడుకల కేక్‌ను కట్ చేశారు. ఆర్డీవో కృష్ణవేణి, మునిసిపల్ వైస్‌చైర్మన్ మార్నేని వెంకన్న, సల్వాది దిలీప్, కొత్త ఇంద్రారెడ్డి, మాదరబోయిన యాకన్న, నాగరాజు, బండి వెంకన్న, సురేష్, విజయ్, గణేష్, రాము,శ్రీను,పాస్టర్లు సేవ్యా, సంపత్‌కుమార్, ఏసు పాదం, తిప్పర్తి శ్రీధర్, కుమారస్వామి, కరుణాకర్ పాల్గొన్నారు.

గాదె రుక్మారెడ్డి మెమోరియల్ హైస్కూల్లో..

మహబూబాబాద్‌లోని గాదె రుక్మారెడ్డి మెమోరియల్ హైస్కూల్‌లో ప్రీ క్రిస్మస్ వేడుకలను నిర్వహించారు. విద్యార్థులు దేవదూతల అలంకరణలో నృత్యాలు చేసి అలరించారు. పాఠశాల డైరెక్టర్లు రీనా గోపికృష్ణ, రజితమాధవ్, కమ్మగాని కృష్ణమూర్తి మాట్లాడుతూ ఏసుక్రీస్తు జీవన విధానం ఆదర్శనీయమని, శాంతి సమాధానం కోసం ఆయన ప్రాణాలర్పించారని తెలిపారు. ఉపాధ్యాయులు హరిప్రసాద్, రఘు, వీరన్న, రాధిక, అశోక్, ప్రణీత్, రాంమూర్తి, వసీమా, అర్పిత, జోత్స్న, చైతన్య, తేజస్విని, నిర్మల, ప్రభావతి, వెన్నెల, రేణుక, సరస్వతి పాల్గొన్నారు.

● ఇనుగుర్తి (ఆంధ్రజ్యోతి) : మండల కేంద్రంలోని పరమగురు క్రీస్తు సంఘంలో ప్రభుత్వ ఆధ్వర్యంలో నిర్వహించిన క్రిస్మస్ వేడుకల్లో ఎమ్మెల్యే మురళీనాయక్ పాల్గొన్నారు. డీటీ ఆకుల రవి, ఎస్‌ఐ మురళీధర్‌రాజ్, ఏవో మహేందర్, మండల పాస్టర్ల సంఘం బాధ్యులు మోహన్‌రెడ్డి, వీరాచారి, ఇజ్రాయిల్, నరేష్‌పాల్, లాలు, ఉప్పలయ్య, కిష్టయ్య, శ్రీను, కాంగ్రెస్ మండల పార్టీ అధ్యక్షుడు కూరెల్లి సతీష్, భైరు అశోక్, చిన్నాల కట్టయ్య, గంజి శ్రీనివాస్‌రెడ్డి, కర్ర నర్సింహారెడ్డి, మహేందర్, వద్దిరాజు మధు పాల్గొన్నారు.

● కేసముద్రం (ఆంధ్రజ్యోతి) : విశ్వమానవ శాంతినే క్రైస్తవం బోధిస్తుందని ఎమ్మెల్యే మురళీనాయక్ అన్నారు. కేసముద్రం ఐకేపీ భవనంలో ప్రభుత్వ తరపున నిర్వహించిన క్రిస్మస్ వేడుకల్లో ఎమ్మెల్యే పాల్గొని కేక్ కట్ చేశారు. ఈ కార్యక్రమంలో మార్కెట్ చైర్మన్ గంట సంజీవరెడ్డి, మహబూబాబాద్ రూరల్ సీఐ సర్వయ్య, తహసీల్దార్ దామోదర్, ఎస్‌ఐ మురళీధర్‌రాజ్, సొసైటీ వైస్ చైర్మన్లు అంబటి మహేందర్‌రెడ్డి, అల్లం నాగేశ్వర్‌రావు, పాస్టర్ల సంఘం జిల్లా అధ్యక్షుడు పిల్లి కుమారస్వామి, మండల అధ్యక్షుడు పేతురు పాల్గొన్నారు.

● మరిపెడ (ఆంధ్రజ్యోతి) : మతమేదైనా ఆయా మతస్థులు వారి వారి దేవుళ్ల విషయంలో అత్యంతభక్తిభావంతో మెలగాలని ప్రభుత్వ విప్, డోర్నకల్ ఎమ్మెల్యే జాటోత్ రాంచంద్రునాయక్ అన్నారు. మరిపెడ మునిసిపల్ కేంద్రంలో ప్రభుత్వం తరుపున నిర్వహించిన సెమీ క్రిస్మస్ వేడుకలకు ఆయన హాజరై కేక్ కట్‌చేసి క్రైస్తవులకు శుభాకాంక్షలు తెలిపారు. జిల్లా మైనార్టీ సంక్షేమ అధికారి శ్రీనివాస్‌రావు, తొర్రూరు ఆర్డీవో గణేశ్, జిల్లా కాంగ్రెస్‌నేత వంటికొమ్ము యుగేందర్‌రెడ్డి, కాంగ్రెస్ మండల అధ్యక్షుడు రఘువీర్‌రెడ్డి, పట్టణ అధ్యక్షుడు తాజ్‌దీన్, తహసీల్దార్ సైదులు, ఎంపీడీవో విజయ, ఎంపీవో సోమ్లానాయక్, మాజీ సర్పంచ్ రాంలాల్, మాజీ ఎంపీటీసీ అంబరీశ, కాలం రవీందర్‌రెడ్డి, ఐలిమల్లు, క్రైస్తవ మత పెద్దలు ఉప్పల వెంకటేశ్వర్లు(జామవా), భాస్కర్, మహేందర్, ప్రభాకర్, దేవరాజ్, రామాచారి, దేవసహాయం, మెకాయేలు పాల్గొన్నారు.

నర్సింహులపేట, దంతాలపల్లిలో..

● ముందస్తు క్రిస్మస్ వేడుకల్లో భాగంగా క్రైస్తవ సోదరులకు జాటోతు రాంచంద్రునాయక్ ఆధ్వర్యంలో శుభాకాంక్షలు తెలిపారు. ఈసందర్భంగా నర్సింహులపేట మండలంతో పాటు దంతాలపల్లిలోని చర్చిలో ప్రత్యేక ప్రార్థనలో ఎమ్మెల్యే పాల్గొన్నారు. ఆర్డీవో గణేష్, తహసీల్దార్ రాజేశ్వర్, గిర్దావర్ నజీముద్దిన్, ఎంపీడీవో వివేక్‌రాం, ఎంపీవో మహ్మద్ అప్సరపాష, పీఏసీఎస్ చైర్మన్ సంపెట రాము, మండల అధ్యక్షుడు భట్టునాయక్, నాయకులు పోన్నేటి బాలాజీ, జానీపాష, దాట్ల తాజామాజీ సర్పంచ్ కొమ్మినేని రవీందర్, అధికారులు, పాల్గొన్నారు.

● డోర్నకల్ (ఆంధ్రజ్యోతి) : ప్రభుత్వం క్రైస్తవుల సంక్షేమానికి అధిక ప్రాధాన్యత ఇస్తుందని మునిసిపల్ చైర్మన్ వాంకుడోతు వీరన్న అన్నారు. డోర్నకల్ మునిసిపల్ కేంద్రంలో క్రిస్మస్ పండుగను పురస్కరించుకుని డోర్నకల్, సీరోల మండలాల క్రైస్తవులకు విందు ఏర్పాటు చేశారు. మునిసిపల్ వైస్ చైర్మన్ కె.కోటిలింగం, తహసీల్దార్ కృష్ణవేణి, సీరోలు తహసీల్దార్ శారద, డోర్నకల్ డీటీ వీరన్న, పట్టణ కాంగ్రెస్ అధ్యక్షుడు సుమీర్ చంద్‌జైన్, కాంగ్రెస్ నాయకులు మాద శ్రీనివాస్, మార్కెట్ కమిటీ డైరెక్టర్ సాధనాల వెంకటేశ్వర్లు, ఎల్లావుల హరికృష్ణ, మహేష్, పవన్, పాఠశాల కరస్పాండెంట్ పసాల ఆంటోని పాల్గొన్నారు.

● కురవి, (ఆంధ్రజ్యోతి) : మండల కేంద్రంలోని చర్చిలో సెమి క్రిస్మస్ వేడుకలు నిర్వహించారు. కాంగ్రెస్ మండల పార్టీ అధ్యక్షుడు అంబటి వీరభద్రం క్రిస్మస్‌కేక్‌ను కట్ చేసి ఉత్సవాలను ప్రారంభించారు. తహసీల్దార్ సునిల్‌రెడ్డి, ఎంపీడీవో వీరబాబు, బాలగాని శ్రీనివాస్, అవిరె మోహన్‌రావు, ఎన్.రాజేందర్‌కుమార్, దయ్యాల శ్రీధర్, చిన్నం గణేష్, బాదె వీరభద్రం, తుకారం నాయక్, లక్ష్మణ్, దైద భద్రయ్య పాల్గొన్నారు.

క్రిస్మస్‌కు వేళాయె
(5వ పేజీ తరువాయి)

చేసేందుకు సన్నద్ధమయ్యారు. మానుకోట పట్టణంలోని సీఎస్ఐ, ఏసుశక్తి సహవాస మందిరం, బిలివర్స్ చర్చిలను ముస్తాబు చేశారు.

డోర్నకల్ సీఎస్‌ఐ చర్చిలో..

జిల్లాలోని డోర్నకల్ మునిసిపల్ కేంద్రంలోని చర్చి ఆఫ్ సౌత్ ఇండియా (సీఎస్‌ఐ)ని విద్యుత్ కాంతులతో ముస్తాబు చేశారు. ఆసియా ఖండంలోనే అతిపెద్ద చర్చి తెలంగాణ రాష్ట్రంలోని మెదక్‌లో ఉండగా, రెండోస్థానంలో డోర్నకల్ చర్చి ఉండడం విశేషం. క్రిస్మస్ వేడుకలను పురస్కరించుకుని ఈ చర్చిలో బుధవారం తెల్లవారుజామున 4 గంటల నుంచి క్రీస్తు సుత్తిస్తూ ప్రార్థనా గీతాలు ఆలపిస్తారు. ఈ సమయంలో ప్రత్యేక సిలువను (ప్రొసెషన్) ధరించిన ఆరుగురు పాస్టర్లు బిషప్‌ను పులిపీట్ వరకు తోడుగా వస్తారు. పులిపీట్ నుంచి బైబిల్ పఠనం చేసిన అనంతరం క్రిస్మస్ విశిష్టతను గురించి క్రీస్తు విశ్వాసులకు బిషప్ సందేశం వినిపిస్తారు. ఆపై డయాస్‌పైకి పాస్టర్లతో చేరుకున్న బిషప్ కార్యక్రమానికి హాజరైన భక్తులకు రొట్టెలు, ద్రాక్షరసంను అందజేస్తారు. భక్తులను ఉద్దేశించి దైవ సందేశం వినిపిస్తారు. అనంతరం తనను కలిసిన భక్తులకు స్వయంగా దీవెనలను అందిస్తారు. కొందరు తల్లిదండ్రులు క్రిస్మస్ సందర్భంగా చిన్నారులకు కానుకలను బిషప్ చేతుల మీదుగా అందిస్తారు. కాగా, క్రిస్మస్ పండుగ పర్వదినాన్ని పురస్కరించుకుని క్రైస్తవులకు బిషప్ కోడిరెక్క పద్మారావు క్రిస్మస్ శుభాకాంక్షలు తెలిపారు.

క్రైం న్యూస్

30 బస్తాల ధాన్యం అపహరణ

మహబూబాబాద్ రూరల్, డిసెంబరు 24 (ఆంధ్రజ్యోతి) : మానుకోట మునిసిపల్ పరిధిలోని ఈదులపూసపల్లిలో 30 బస్తాల ధాన్యాన్ని సోమవారం రాత్రి గుర్తుతెలియని వ్యక్తులు అపహరించుకుపోయినట్లు బాధిత రైతు పత్రి భరత్ మంగళవారం తెలిపారు. గ్రామశివారులో వారం రోజులుగా వడ్లు ఆరబోసి, రెండు రోజుల క్రితం బస్తాల్లోకి ఎత్తినట్లు తెలిపారు. సోమవారం రాత్రి పొద్దుపోయే వరకు ఉన్న బస్తాలు మంగళవారం తెల్లవారుజామున వచ్చి చూసే సరికి మొత్తం 50 బస్తాలకు 30 ధాన్యం బస్తాలు గుర్తుతెలియని వ్యక్తులు అపహరించుకుపోయినట్లు చెప్పారు. వడ్ల విలువ సుమారు రూ.50 వేల నుంచి రూ.60 వేల వరకు ఉంటుందని భరత్ తెలిపారు. ఈ విషయంపై రూరల్ పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేసినట్లు భరత్ తెలిపారు.

విద్యుత్ మోటార్లు చోరీ

మహబూబాబాద్ రూరల్, డిసెంబరు24 (ఆంధ్రజ్యోతి) : జిల్లా కేంద్రం శివారులోని ఈదులపూసపల్లి, అనంతారం గ్రామాలకు చెందిన రైతుల విద్యుత్‌మోటార్లను సోమవారం రాత్రి అపహరించుకుపోయినట్లు మంగళవారం బాధితులు తెలిపారు. ఈదులపూసపల్లికి చెందిన గట్ల వెంకన్నకు చెందిన మోటారు, అనంతారం గౌస్‌కు చెందిన రెండు మోటార్లను గుర్తుతెలియని వ్యక్తులు ఎత్తుకుపోయినట్లు చెప్పారు. వాటి విలువ సుమారు రూ.30 వేలు ఉంటుందని బాధితులు తెలిపారు.

రాంపూర్‌లో..
రూ. 10 వేల నగదు, 33 తులాలు వెండి ఆభరణాలు అపహరణ

మరిపెడ రూరల్, డిసెంబరు 24(ఆంధ్రజ్యోతి):మండలంలోని రాంపూర్‌లోని రెండిళ్లలో గుర్తు తెలియని వ్యక్తులు చోరీకి పాల్పడ్డారు. ఎస్సై సంతోష్ తెలిపిన వివరాల ప్రకారం.. రాంపూర్‌లోని ఈరగాని ఉపేందర్, బాలాజీల ఇళ్లలో మంగళవారం తెల్లవారుజామున గుర్తు తెలియని వ్యక్తులు చోరీకి పాల్పడ్డారు. ఉపేందర్ ఇంట్లోని బీరువాలో ఉన్న రూ. 10 వేల నగదుతోపాటు 25 తులాల వెండి, బాలాజీ ఇంట్లో 8 తులాల వెండి(పట్టీలు) అపహరించారు. బాధితులు ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తెలిపారు.

వ్యక్తిపై కేసు నమోదు

కురవి, డిసెంబరు 24 (ఆంధ్రజ్యోతి) : ప్రభుత్వ ఉద్యోగి విధులకు ఆటంకం కలిగించిన వ్యక్తిపై కేసు నమోదుచేసినట్లు కురవి ఎస్సై గంద్రాతి సతీష్ తెలిపారు. ఈ నెల 23న కురవి మండలం అయ్యగారిపల్లి గ్రామ పంచాయతీ కార్యదర్శి గుగులోతు రాము తన విధి నిర్వహణలో భాగంగా ఇందిరమ్మ ఇండ్ల సర్వేచేస్తుండగా అదే గ్రామానికి చెందిన గజ్జి అఖిల్ తన ఇంటిముందు ఉన్న డ్రైనేజీ పూడిక మట్టిని తీయాలని పంచాయతీ కార్యదర్శితో గొడవ పెట్టుకున్నాడు. ఈ క్రమంలో కార్యదర్శిపై భౌతిక దాడి చేశాడని, కార్యదర్శి ఫిర్యాదు మేరకు అఖిల్‌పై కేసు నమోదు చేసినట్లు తెలిపారు.

ఉత్తమ ఫలితాలు సాధించేందుకు కృషి చేయాలి
డీఈవో రవీందర్‌రెడ్డి



విద్యార్థులకు స్టడీ మెటీరియల్ పంపిణీ చేస్తున్న డీఈవో రవీందర్‌రెడ్డి

చిన్నగూడూరు, డిసెంబరు24(ఆంధ్రజ్యోతి) : వసతి గృహాల్లోని విద్యార్థులు వార్షిక పరీక్షల్లో ఉత్తమ ఫలితాలు సాధించేలా కృషి చేయాలని డీఈవో రవీందర్‌రెడ్డి అన్నారు. మంగళవారం మండలంలోని కస్తూర్బాగాంధీ బాలికల పాఠశాలను అయన సందర్శించారు. ఈ సందర్భంగా పదో తరగతి విద్యార్థినులకు దాతల సహకారంతో అందించిన స్టడీ మెటీరియల్‌ను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా అయన మాట్లాడుతూ ఉపాధ్యాయులు విద్యార్థులను ప్రతీచాప్టర్లో పట్టు సాధించే విధంగా కృషి చేసి వందశాతం ఉత్తీర్ణత సాధించాలని కోరారు. ఏసీజీఈ శ్రీరాములు, ఉపాధ్యాయులు, సిబ్బంది పాల్గొన్నారు.

గుండె పోటుతో రిటైర్డ్ పీడీ సమ్మయ్య మృతి



మహబూబాబాద్ టౌన్, డిసెంబరు24 (ఆంధ్రజ్యోతి) : పట్టణానికి చెందిన రిటైర్డ్ ఫిజికల్ డైరెక్టర్ డోలి సమ్మయ్య (75) గుండె పోటుతో హైదరాబాద్‌లో మృతి చెందాడు. గత కొంత కాలంగా ఆయన హైదరాబాద్‌లో తన కుమారుడి ఇంటి వద్ద ఉంటున్నాడు. ఈక్రమంలో సమ్మయ్యకు మంగళవారం తెల్లవారుజామున గుండె పోటు రావడంతో హైదరాబాద్‌లోని ఓ ప్రైవేట్ ఆస్పత్రికి తరలించగా అక్కడ చికిత్స పొందుతూ మృతి చెందాడు. మృతుడికి ఇద్దరు కుమారులు, ఇద్దరు కుమార్తెలు ఉన్నారు. కాగా, సమ్మయ్య పీఈటీ, పీడీగా పని చేసిన సమయంలో పట్టణంలో ఎంతో మందికి క్రీడా మెలకువలు నేర్పి రాష్ట్ర, జాతీయ. అంతర్జాతీయ స్థాయి క్రీడాకారులుగా తీర్చిదిద్ది వారి గుండెల్లో చెరగని ముద్ర వేసుకున్నారు. ఈ విషయం తెలుసుకున్న మాజీ ఎమ్మెల్యే బండి పుల్లయ్య, టీజేఎస్ జిల్లా అధ్యక్షుడు డోలి సత్యనారాయణ, మా అసోయేషన్ అధ్యక్షుడు బొడ్డుపల్లి ఉపేంద్రం, బాస్కెట్ బాల్ ఉమ్మడి వరంగల్ జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు పృధీశ్వర్‌రెడ్డి, ముల్లంగి ప్రతాప్‌రెడ్డి, జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు ప్రసాద్‌రెడ్డి, కుమారస్వామి, ఐఆర్‌సీఎస్ జిల్లా చైర్మన్ పీవీ. ప్రసాద్, బేస్‌బాల్ జిల్లా అధ్యక్షుడు ప్రభాకర్, పల్లె కొమురయ్య, మాజీ సర్పంచ్ భూక్య నెహ్రూనాయక్, సీపీఐ జిల్లా కార్యదర్శి బి.విజయసారథి, ముల్లంగి మోహన్‌రెడ్డి, ఎమ్డీ. ఫరీద్, పుష్పలీల, విజయలక్ష్మి, అరుణ, వడ్లకొండ సుభాష్, ఇనుగుర్తి సుధాకర్ తదితరులు మానుకోట పట్టణంలో డోలి సమ్మయ్య మృతదేహంపై పుష్పగుచ్ఛాలుంచి నివాళులర్పించారు. ఆయన కుటుంబ సభ్యులకు తమ ప్రగాఢ సానుభూతి వ్యక్తం చేశారు.

'మార్కెట్ బిల్లును రద్దు చేయాలి'

మహబూబాబాద్ రూరల్, డిసెంబరు24(ఆంధ్రజ్యోతి) : కేంద్ర ప్రభుత్వం తీసుకువచ్చిన నూతన వ్యవసాయ మార్కెట్ బిల్లును వెంటనే రద్దు చేయాలని ఏఐకేఎస్ రాష్ట్ర సహాయ కార్యదర్శి పాయం చిన్న చంద్రన్న, ఏఐకేఎంఎస్ రాష్ట కోశాధికారి నందగిరి వెంకటేశ్వర్లు డిమాండ్ చేశారు. జిల్లా కేంద్రంలోని వ్యవసాయ మార్కెట్ సమీపంలో నూతన వ్యవసాయ మార్కెట్ బిల్లుల ప్రతులను మంగళవారం దహనం చేశారు. గుజ్జు దేవేందర్, నల్లపు సుధాకర్, మేక వీరన్న, ఎస్‌కె.బాబన్న, గునిగంటి రాజన్న, సక్రు, బండపల్లి వెంకటేశ్వర్లు, ముంజంపల్లి వీరన్న, భాస్కర్‌రెడ్డి, పైండ్ల యాకయ్య, ప్రభాకర్‌రెడ్డి, శివ్వారపు శ్రీధర్, చారీ హరీష్ పాల్గొన్నారు.

క్రైస్తవుల అభివృద్ధికి కృషి

నెల్లికుదురు, డిసెంబరు24 : (ఆంధ్రజ్యోతి) : క్రైస్తవుల అభివృద్ధికి ప్రభుత్వం కృషి చేస్తుందని ఎమ్మెల్యే మురళీనాయక్ తెలిపారు. నెల్లికుదురులోని సెయింట్‌పీటర్స్ ఇంటీరియర్ బాప్టిస్ట్ చర్చిలో మంగళవారం క్రిస్‌మస్ వేడుకలు నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ చర్చి నిర్మాణానికి 20 గుం టలు స్థలంకేటాయించనున్నట్లు తెలిపారు. తహసీల్దార్ కె.రాజు, ఎంపీడీవో బాలరాజు మండల పాస్టర్స్ ఫెల్లోషిప్ అధ్యక్షుడు మోజస్‌పాల్, జి.అబ్రహం, విజయ్‌పాల్, రాజేంద్రకుమార్ పాల్గొన్నారు.

'అమిత్‌షాను బర్తరఫ్ చేయాలి'

మహబూబాబాద్ టౌన్, డిసెంబరు 24 (ఆంధ్రజ్యోతి) : భారత రాజ్యాంగ నిర్మాత డాక్టర్ బీఆర్. అంబేద్కర్‌ను అవమానపర్చిన కేంద్ర హోం శాఖ మంత్రి అమిత్‌షాను మంత్రిమండలి నుంచి బర్తరఫ్ చేయాలని బహుజన్ సమాజ్ పార్టీ (బీఎస్పీ) రాష్ట కార్యదర్శి దార్ల శివరాజ్ డిమాండ్ చేశారు. మహబూబాబాద్ జిల్లా కలెక్టర్ కార్యాలయం ఎదుట మంగళవారం బీఎస్పీ ఆధ్వర్యంలో తలకు నల్లరిబ్బన్లు కట్టుకుని శాంతియుత నిరసన తెలిపారు. అనంతరంకలెక్టర్ అద్వైత్‌కుమార్‌సింగ్‌కు వినతి పత్రాన్ని అందించారు. ఈ కార్యక్రమంలో ఎల్.విజయకాంత్, దార ప్రసాదరావు, ఇసంపెల్లి ఉపేందర్, తగరం నాగన్న, ఎడ్ల శ్రీను, నరేష్‌నాయక్, తప్పెట్ల చాణక్య, హేమంత్, రాంబాబు, మనోజ్, శ్రీను, ప్రవీణ్ పాల్గొన్నారు.

దివ్యాంగుల సమస్యలు పరిష్కరించాలి

మహబూబాబాద్ టౌన్, డిసెంబరు 24 (ఆంధ్రజ్యోతి): దివ్యాంగులు ఎదుర్కొంటున్న సమస్యలను తక్షణమే పరిష్కరించాలని వికలాంగుల హక్కుల జాతీయ వేదిక (ఎన్పీఆర్డీ)జిల్లా అధ్యక్షుడు వర్రె బాలకృష్ణ డిమాండ్ చేశారు. కలెక్టరేట్‌లోని ఐసీడీఎస్ కార్యాలయంలో జిల్లా సంక్షేమశాఖ అధికారి ధనమ్మకు మంగళవారం వినతిపత్రాన్ని అందించారు. కార్యదర్శి రడం గౌరమ్మ, సరిత, సుధాకర్, ఆర్.సారయ్య ఎం.నరేష్ పాల్గొన్నారు.

పెన్షనర్ల సంక్షేమానికి కట్టుబడి ఉన్నాం
● పాలకుర్తి ఎమ్మెల్యే యశస్వినిరెడ్డి



ఎమ్మెల్యే యశస్వినిరెడ్డిని సన్మానిస్తున్న విశ్రాంత ఉద్యోగులు

తొర్రూరు, డిసెంబరు 24 (ఆంధ్రజ్యోతి): ప్రభుత్వం పెన్షనర్ల (విశ్రాంత ఉద్యోగులు) సంక్షేమానికి కట్టుబడి ఉందని ఎమ్మెల్యే యశస్వినిరెడ్డి అన్నారు. మంగళవారం తొర్రూరులోని లయన్స్‌క్లబ్ ఆవరణంలో పెన్షనర్ల దినోత్సవం సందర్భంగా జిల్లా పెన్షనర్ల సంఘం ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన సమావేశానికి ఆమె ముఖ్యఅతిథిగా హాజరై మాట్లాడారు. పెన్షనర్లు సమాజానికి చేసిన సేవ మరువలేనిదని వారి సేవలకు గౌరవంగా ప్రభుత్వం అండగా ఉంటుందన్నారు. ఎమ్మెల్యేని శాలువా, మెమోంటోలతో ఘనంగా సత్కరించారు. అనంతరం పార్టీ కార్యాలయంలో నియోజకవర్గంలో తొర్రూరు, పెద్దవంగర మండలాలకు చెందిన 46 మంది లబ్ధిదారులకు ముఖ్యమంత్రి సహాయ నిధి నుంచి మంజూరైన రూ. 15 లక్షల చెక్కులను అందజేశారు. పెన్షనర్ల సంఘం జిల్లా అధ్యక్షులు మైస నాగయ్య, ప్రధానకార్యదర్శి వి. సోమయ్య, తొర్రూరు మండల అధ్యక్షులు ఇట్టె సోమారెడ్డి, కార్యదర్శి ఎమ్డీ. యాకూబ్, కోశాధికారి చెన్నోజు విజయ్‌కుమార్, కార్యవర్గ సభ్యులు బ్యాంక్‌ఆఫ్‌ఇండియా మేనేజర్ మధు, కాంగ్రెస్‌పార్టీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.



వార్డు కౌన్సిలర్ ఉమకు రూ.లక్ష చెక్కును అందజేస్తున్న మునిసిపల్ చైర్మన్ రాంమోహన్‌రెడ్డి, బీఆర్ఎస్ నేతలు

వార్డు కౌన్సిలర్‌కు రూ.లక్ష ఆర్థిక సాయం

మహబూబాబాద్ టౌన్, డిసెంబరు 24 (ఆంధ్రజ్యోతి): మునిసిపల్ నాలుగోవార్డు కౌన్సిలర్ చల్లాల ఉమా కుటుంబానికి శాసనమండలి సభ్యుడు పోచంపల్లి శ్రీనివాస్‌రెడ్డి రూ.లక్ష ఆర్థిక సాయాన్ని మంగళవారం అందించారు. వివరాల్లోకి వెళితే. కౌన్సిలర్ చల్లాల ఉమ భర్త యాకయ్య ఇటీవల రోడ్డు ప్రమాదంలో మృతి చెందాడు. విషయం తెలుసుకున్న పోచంపల్లి పోచంపల్లి ఫౌండేషన్ ద్వారా ఆ కుటుంబానికి రూ.లక్ష సాయాన్ని అందించారు. సదరు రూ.లక్ష చెక్కును గాంధీపురంలో చల్లాల ఉమాకు మునిసిపల్ చైర్మన్ పాల్వాయి రాంమోహన్‌రెడ్డి, బీఆర్ఎస్ నాయకుల చేతుల మీదుగా మంగళవారం అందించారు. అందుకు సహకరించిన బీఆర్ఎస్ యూత్ అర్బన్ అధ్యక్షుడు యాళ్ల మురళీధర్‌రెడ్డిని అభినందించారు. వైస్ చైర్మన్ వెంకన్న, పర్కాల శ్రీనివాస్‌రెడ్డి , చిట్యాల జనార్ధన్, కొండపల్లి కరుణాకర్‌రెడ్డి, శివ, డౌలాగర్ శంకర్, చెంగు, పిల్లి సుధాకర్, షఫీ, సాగర్, శ్రీనివాస్‌రెడ్డి, రాంబాబు పాల్గొన్నారు.

నాగేంద్రాచారికి సన్మానం



నాగేంద్రాచారిని సన్మానిస్తున్న జానపద కళాకారుల సంఘం సభ్యులు

నెల్లికుదురు, డిసెంబరు24 (ఆంధ్రజ్యోతి) : రావిరాల గ్రామానికి చెందిన జానపద కళాకారుల సంఘం జిల్లా అధ్యక్షుడు అక్కిర నాగేంద్రాచారికి హైదరాబాద్ రవీంద్రభారతిలో మంగళవారం సన్మానించారు. ప్రభుత్వం భాష, సాంస్కృతికశాఖ కళావాహిణి సారిపెల్లి కొండల్‌రావు సౌజన్యంతో రాష్ట్ర జానపదకళాకారుల సంఘంఆధ్వర్యంలో కేవీ రమణాచారి సన్మానించారు. సంగీత అకాడమి చైర్మన్ అలఖ్య సాంస్కృతికి సారథి చైర్మన్ వెన్నెల, వంగ శ్రీనివాస్‌గౌడ్, లింగన్న పాల్గొన్నారు.

'ఆర్థిక భరోసా ఇవ్వాలి'

మహబూబాబాద్ టౌన్, డిసెంబరు 24 (ఆంధ్రజ్యోతి): కాంగ్రెస్ ప్రభుత్వం ఎన్నికల్లో ఇచ్చిన హామీల్లో భాగంగా జాబ్ కార్డు ఉన్న ఉపాధి హామీ, వ్యవసాయకూలీలకు రూ.12 వేల ఆర్థికభరోసాను అందించాలని వ్యవసాయ కార్మిక సంఘం జిల్లాప్రధానకార్యదర్శి చింతకుంట్ల వెంకన్న మంగళవారం ఒక ప్రకటనలో డిమాండ్ చేశారు. ఒకటి, రెండు గుంటల భూమి ఉన్న చిన్న, సన్న కారు రైతు కూలీలకు ఇస్తారా లేదా అని ప్రశ్నించారు. గత బీఆర్ఎస్ ప్రభుత్వంలో ఏడాదిలో ఉపాధికూలీలకు ఏనాడు వంద రోజుల పని కల్పించిన దాఖాలాలు లేవని, అలాంటప్పుడు వంద రోజులు పూర్తి చేసిన వారికి ఆర్థిక భరోసా అంటే ఎవరికి వచ్చే పరిస్థితి లేదన్నారు. అందుకోసం జాబ్‌కార్డు ఉన్న ఉపాధి హామి కూలీలందరికి రూ. 12 వేలు అందించాలని విజ్ఞప్తి చేశారు.

ఎరువుల దుకాణాల్లో తనిఖీ

డోర్నకల్, డిసెంబరు 24 (ఆంధ్రజ్యోతి) : డోర్నకల్ మునిసిపల్ కేంద్రంలోని ఎరువులు, పురుగుల దుకాణాలలో మంగళవారం వ్యవసాయ, రెవెన్యూ శాఖల అధికారులు ఆకస్మీకంగా తనిఖీలు చేపట్టారు. ఎరువులు, పురుగు మందుల దుకాణ యాజమానులు యూరియా అడిగితే ఇవ్వడం లేదని కొందరు రైతులు చేసిన ఫిర్యాదు మేరకు షాపులలో తనిఖీలు చేపట్టినట్లు మండల వ్యవసాయాధికారి మురళీమోహన్, డిప్యూటీ తహసీల్దార్ వీరన్న తెలిపారు. దుకాణాల్లోని స్టాక్ రిజిస్టర్‌లను తనిఖీ చేశారు. యూరియా కొరత ఉందా.. ఉంటే ప్రభుత్వం దృష్టికి ఎందుకు తీసుకురాలేదని షాపుయాజమానులను మునిసిపల్ చైర్మన్ వీరన్న ప్రశ్నించారు. కోట ప్రకారమే యూరియా సరఫరా చేస్తున్నట్లు ఏవో మురళీమోహన్ తెలిపారు.

టీబీఎస్ఎస్ఎస్ జిల్లా అధ్యక్షుడిగా సుధాకరశాస్త్రి

మహబూబాబాద్ టౌన్, డిసెంబరు 24 (ఆంధ్రజ్యోతి) : తెలంగాణ బ్రాహ్మణ సేవా సంఘ సమాఖ్య (టీబీఎస్ఎస్ఎస్) జిల్లా అధ్యక్షుడిగా రంగావఝ్ఝుల సుధాకరశాస్త్రి ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. మహబూబాబాద్ పట్టణంలోని శివాలయంలో మంగళవారం సంఘ సభ్యులంతా సమావేశమై నూతన కమిటీ ఎన్నుకున్నారు. ప్రధాన కార్యదర్శిగా దుర్గారాజు నర్సింహారావు, కోశాధికారిగా క్యాచువల్యాంసుందర్‌శర్మ, ఉపాధ్యక్షులుగా డాక్టర్ రామారావు, వెన్నప్ప శ్రీనివాస్, కార్యదర్శులుగా ఆర్‌వీ. ప్రసాద్, ఎలుకూరు నాగయ్యశాస్త్రి, రామేశ్వర్ తివారీ, దుర్గా రాజు రాజశేఖర్‌రావు, పనిభట్ల రాకేష్‌శర్మ, ఓలేటి వెంకటాచార్యులు, ముడుంబైలక్ష్మీనర్సింహాచార్యులు (గుణనిధి)తో పాటు పది మందిని కార్యవర్గ సభ్యులుగా ఎన్నుకున్నారు. తమ ఎన్నికకు సహకరించిన ప్రతీ ఒక్కరికి నూతన అధ్యక్షుడు సుధాకరశాస్త్రి కృతజ్ఞతలు తెలిపారు.

ఆరోగ్య పరీక్షలు నిర్వహించుకోవాలి
●సంపూర్ణ ఆరోగ్య కేంద్రం మేనేజర్ రమేష్

నెహ్రూసెంటర్, డిసెంబరు 24 (ఆంధ్రజ్యోతి) : ప్రతీ ఒక్కరు ఆరోగ్య పరీక్షలు నిర్వహించుకుని సంపూర్ణ ఆరోగ్యవంతంగా ఉండాలని సంపూర్ణ ఆరోగ్య కేంద్రం మేనేజర్ బి.రమేష్ అన్నారు. జిల్లా కేంద్రంలోని ఆర్టీసీ బస్టాండ్‌లో మంగళవారం హెల్త్ క్యాంప్ నిర్వహించి, అవగాన కల్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సుఖలైంగిక వ్యాధుల పట్ల ట్రీట్‌మెంట్ సమస్యల కోసం సంపూర్ణ సురక్ష కేంద్రంను సంప్రదించాలన్నారు. అనంతరం సంపూర్ణ సురక్షత కేంద్రం ఆధ్వర్యంలో ముద్రించిన కరపత్రాలను ఆవిష్కరించారు. కార్యక్రమంలో మానస, గౌతమి, ప్రయాణీకులు పాల్గొన్నారు.

కేంద్ర హోంమంత్రి రాజీనామా చేయాలి

మహబూబాబాద్ ఎడ్యుకేషన్, డిసెంబరు 24 (ఆంధ్రజ్యోతి): డాక్టర్ బీఆర్ అంబేద్కర్‌పై అనుచిత వ్యాఖ్యలు చేసిన కేంద్రహోం మంత్రి అమిత్‌షా వెంటనే మంత్రి పదవికి రాజీనామా చేయాలని ఎస్సీ, ఎస్టీ ఉపాధ్యాయుల ఐక్య వేదిక మహబూబాబాద్ జిల్లా అధ్యక్షుడు చాగంటి ప్రభాకర్ డిమాండ్ చేశారు. జిల్లా కేంద్రంలోని సంఘం ఆధ్వర్యంలో మంగళవారం అంబేద్కర్ విగ్రహంకు పూలమాల వేసి నిరసన వ్యక్తం చేశారు. నాయకులు కొమిరే ఉప్పలయ్య, మద్దెల వీరస్వామి, ధరావత్ వీరన్న, లూనివత్ కృష్ణ, యాదగిరి, రాజశేఖర్, శంకర్, విజయ్‌కుమార్, మోహన్, సుజాత పాల్గొన్నారు.

ధాన్యం తరలింపులో అధికారుల నిర్లక్ష్యం
సీపీఐ (ఎంఎల్) మాస్‌లైన్ ప్రజాపంథా నేత రవి

కొత్తగూడ, డిసెంబరు 24 (ఆంధ్రజ్యోతి) : ధాన్యం కొనుగోలు కేంద్రాల నుంచి సకాలంలో ధాన్యాన్ని తరలించడంలో అధికారులు నిర్లక్ష్యం వహిస్తున్నారని సీపీఐ (ఎంఎల్) మాస్‌లైన్ ప్రజాపంథా జిల్లా సహాయ కార్యదర్శి రవి ఆరోపించారు. మండలంలోని తిమ్మాపురంలో నిర్వహించిన సమావేశంలో రవి మాట్లాడుతూ సంచుల కొరత ఉందని, లారీలు సకాలంలో రావడంలేదని సాకులు చెబుతు ధాన్యాన్ని తరలించడంలో నిర్లక్ష్యం వహిస్తున్నారని ఆరోపించారు. వర్షాలు కురుస్తే ధాన్యం తడుస్తుందని రైతులు భయం భయంగా ఉంటున్నారని ఆవేదన చెందారు. వర్షాల వలన ధాన్యం తడువకుండా ఉండేందు కొనుగోలు కేంద్రాల వద్ద శాశ్వత నిర్మాణాలు చేపట్టాలని డిమాండ్ చేశారు. రైతుల సమస్యలను తక్షణమే పరిష్కరించాలని డిమాండ్ చేశారు. లేనిచో రైతులతో కలిసి ఆందోళనలు చేపడతామని హెచ్చరించారు. సమావేశంలో అఖిల భారత సమైక్య రైతు సంఘం జిల్లా అధ్యక్షుడు పూనెం ప్రభాకర్, అఖిల భారత యునైటెడ్ రైతు సంఘం జిల్లా నాయకులు ఈక భిక్షం, ముద్రబోయిన కొమ్మాలు, ఆకుతోట రామ్మూర్తి, మాస్‌లైన్ డివిజన్ నాయకుడు ఈరెల్లి మల్లేష్ పాల్గొన్నారు.

జాతీయ రగ్బీ పోటీలకు త్రిష ఎంపిక



డోర్నకల్, డిసెంబరు 24 (ఆంధ్రజ్యోతి) : స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ ఆఫ్ ఇండియా ఆధ్వర్యంలోనిర్వహించనున్న జాతీయస్థాయి రగ్బీ పోటీలకు చిల్కోడు మోడల్ స్కూల్ విద్యార్థిని ధనియాకుల త్రిష ఎంపికైనట్లు పాఠశాల హెచ్ఎం కృష్ణభాను, పీడీ గోవర్ధన్‌లు తెలిపారు. అండర్-17 విభాగంలో త్రిష గతనెల 10 నుంచి 12 వరకు మేడ్చల్‌లో జరిగిన రాష్ట్రస్థాయి రగ్బీ పోటీల్లో పాల్గొని అత్యంత ప్రతిభ కనబరిచి జాతీయ స్థాయికి ఎంపికైనట్లు చెప్పారు. ఈ నెల 27 నుంచి 29 వరకు బీహార్ రాష్ట్రంలోని పాట్నాలో జరిగే జాతీయ స్థాయి పోటీల్లో త్రిష తెలంగాణ రాష్ట్ర జట్టు నుంచి ప్రాతినిధ్యం వహించనున్నట్లు చెప్పారు.

పేదలకు ఇళ్లు మంజూరు చేయాలి

ఇనుగుర్తి, డిసెంబరు 24 (ఆంధ్రజ్యోతి) : ఇనుగుర్తి మండల కేంద్రంలో పేదలకు ఇందిరమ్మ ఇళ్లు మంజూరు చేయాలని సీపీఎం మండల కార్యదర్శి గోడిశాల వెంకన్న కోరారు. ఈ మేరకు మంగళవారం ఇనుగుర్తిలో డీటీ ఆకుల రవికి పార్టీ తరపున వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా వెంకన్న మాట్లాడుతూ 1998లో 168 మంది నిరుపేదలకు ఇళ్ల స్థలాల కోసం ఆరెకరాల స్థలాన్ని ప్రభుత్వం కొనుగోలు చేసి పట్టాలను పంపిణీ చేసిందని తెలిపారు. వీరందరికీ ఇందిరమ్మ ఇళ్లు మంజూరు చేయాలని కోరారు. కార్యక్రమంలో గ్రామపార్టీ కార్యదర్శి ఆవుల వెంకన్న, కావటి నర్సయ్య, సోమారపు ఎల్లయ్య, బండి సత్యం, గంజి సంజీవరెడ్డి, పెశెట్టి ఉప్పలయ్య, నర్సయ్య, జన్నయ్య, అమీర్, అనీల్, యాకయ్య, హరీష్ పాల్గొన్నారు.

సిబ్బందికి రెమ్యూనరేషన్ చెల్లించాలి

డోర్నకల్, డిసెంబరు24 (ఆంధ్రజ్యోతి) :ప్రభుత్వం ఇటీవల నిర్వహించిన కులగణన సర్వేలో పాల్గొన్న ఎన్యుమరేటర్స్, సూపర్‌వైజర్లకు రెమ్యూనరేషన్ వెంటనే చెల్లించాలని టీఎస్ యూటీఎఫ్ డోర్నకల్ మండల అధ్యక్ష, కార్యదర్శులు అబ్దుల్ అజీజ్, శివప్రసాద్ డిమాండ్ చేశారు. మంగళవారం ఈ మేరకు డోర్నకల్ ఎంపీడీవో, తహసీల్దార్, మునిసిపల్ కార్యాలయాల్లో అధికారులకు వినతిపత్రాలు అందించారు. ఎఫ్‌డబ్ల్యూఎఫ్ కన్వీనర్ పి.రాములు పాల్గొన్నారు.

శ్రీఈశ్వరదేవి అమ్మవారికి పూజలు

మహబూబాబాద్ ఎడ్యుకేషన్, డిసెంబరు 24 (ఆంధ్రజ్యోతి): మానుకోటలోని శ్రీమద్విరాట్‌పోతులూరి వీరబ్రహ్మేంద్రస్వామి దేవాలయంలో శ్రీఈశ్వరదేవి అమ్మవారికి ఆరాధన మహోత్సవ పూజలు నిర్వహించారు. స్థానిక దేవాలయంలో మంగళవారం ఆలయట్రస్టు ఆధ్వర్యంలో శ్రీఈశ్వరదేవి అమ్మవారికి ప్రధాన అర్చకుడు తాటిపాముల శివకృష్ణశర్మ వేదమంత్రోచ్ఛరణల నడుమ ఆరాధన మహోత్సవ పూజలు నిర్వహించారు.

సంక్షిప్త వార్తలు

ఆశాల సమస్యల పరిష్కారానికి కృషి
● సీఐటీయూ రాష్ట్ర అధ్యక్షురాలు కాసు మాధవి



సీఐటీయూలో చేరిన ఆశావర్కర్లతో మాధవి

తొర్రూరు, డిసెంబరు 24 (ఆంధ్రజ్యోతి): ఆశాల సమస్యల పరిష్కారం కోసం సీఐటీయూ నిరంతరం పని చేస్తోందని ఆశావర్కర్స్ యూనియన్ రాష్ట్ర అధ్యక్షురాలు కాసు మాధవి అన్నారు. మంగళవారం తొర్రూరు డివిజన్ పరిధిలోని ప్రభుత్వ ఆసుపత్రిలో పనిచేస్తున్న ఆశావర్కర్లు మాధవి ఆధ్వర్యంలో సీఐటీయులో చేరారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ప్రజల ఆరోగ్య సంరక్షణ కోసం ఆశాలు అంకితభావంతో పనిచేస్తున్నారన్నారు. ఎన్నికలకు ముందు వేతనాలు పెంచుతానని హామీ ఇచ్చిన కాంగ్రెస్ ప్రభుత్వం వెంటనే రూ.18వేల వేతనంతో పాటు ఉద్యోగ భద్రత, ఈఎస్ఐ. పీఎఫ్. సౌక ర్యం కల్పించాలని డిమాండ్ చేశారు. ఈనెల 28న జిల్లా కేంద్రంలో జరిగే సభకు ఆశాలు అధిక సంఖ్యలో హాజరై విజయవంతం చేయాలని కోరారు. నాయకులు శ్రీను, వీరన్న, రేణుక, అరుణ, శోభ, సంధ్య, సునిత, సమ్మక్క, స్వరూప, శ్రీలత ఉన్నారు.

కుట్రలను ప్రతిఘటించాలి
సీపీఐ జిల్లా సహాయ కార్యదర్శి నల్లు సుధాకర్‌రెడ్డి

కురవి, డిసెంబరు24 (ఆంధ్రజ్యోతి) : రాజ్యాంగాన్ని మార్చాలనే మనువాదుల కుట్రలను ప్రజాస్వామికవాదులు ప్రతిఘటించి రాజ్యాంగాన్ని రక్షించాలని సీపీఐ జిల్లా సహాయ కార్యదర్శి నల్లు సుధాకర్‌రెడ్డి అన్నారు. కురవిలో మంగళవారం జరిగిన అపార్టీ కౌన్సిల్ సమావేశంలో ఆయన మాట్లాడారు. మండల కార్యదర్శి కర్నం రాజన్న, బుర్ర సమయ్య, తురక రమేష్, కన్నె వెంకన్న, దొంతు రామ్మూర్తి, దూదికట్ల సారయ్య, బొల్లం ఉప్పలయ్య, వీరన్న పాల్గొన్నారు.